Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 289 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 నవంబర్ 2023 మంగళవారం

## గాజాలో ఆకలిరాజ్యం!

యుద్ధ కల్లోలిత గాజా క్రమంగా ఆకలిరాజ్యంగా మారుతోంది. సలాహ్ అల్-దీన్ వద్ద ఇజ్రాయెల్ సేనలు మోహరించడంతో.. ఉత్తర-దక్షిణ గాజాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఫలితంగా ఈజిప్ట్ నుంచి రఫా సరిహద్దు మీదుగా వస్తున్న మానవతాసాయం గాజాకు చేరడం లేదు. దీంతో.. గాజా ఉత్తరాది వారికి పూటకు ఒక రొట్టె దొరకడం కూడా గగనంగా మారుతోంది. "గాజా మొత్తమ్మీద ఒక సగటు పౌరుడు రోజుకు రెండు రొట్టెముక్కలు తిని జీవిస్తున్నాడు. తాగడానికి మంచినీళ్లు కూడా లేవు" అని ఐరాస సెక్రటరీ జనరల్ గుటెర్రస్ ఆందోళన వ్యక్తం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పరిస్థితులు మరో వారంపదిరోజులు ఇలాగే కొనసాగితే.. ఆకలిచావులు తప్పవని గాజాలోని ఎన్జీవోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉత్తర గాజాతోపాటు.. దక్షిణాదిన కూడా దారుణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. నుసిరాత్ శిబిరంలో ఉన్న ఓ రైతు.. తన పిల్లలు పాలు తాగి మూడు వారాలవుతోందని కన్నీటి పర్యంతం చెప్పారు.

# ఓటు దుర్వినియోగం చేసి ఆగంకాకుండ్రి

## గద్వాల ప్రజా ఆశీర్వాద సభలో బీజేపీ, కాంగ్రెస్‌పై మండిపడ్డ సీఎం కేసీఆర్

గద్వాల : తెలంగాణపై పెత్తనం.. పచ్చబడ్డ రాష్ట్రాన్ని మళ్లీ కరగనాకేందుకే కాంగ్రెస్ ఆరాటమని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. గద్వాల ప్రజా ఆశీర్వాద సభలో బీజేపీ, కాంగ్రెస్‌పై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'బీజేపీ నుంచి నోరుపెట్టుకొని వస్తున్నరు. 157 మెడికల్ కాలేలు దేశంలో కడితే.. మనకు ఒక్క మెడికల్ కాలేజీ ఇయ్యలే. చట్టం ఉన్నది. కొత్త జిల్లాలకు నవోదయ పాఠశాల ఇవ్వాలి. నేను నూరు ఉత్తరాలు రాసిన నరేంద్ర మోదీకి. ఒక్క పాఠశాల కూడా ఇయ్యలే. మాకు వస్తే గద్వాలకు నవోదయ పాఠశాల వస్తుండే. ఒక్క మెడికల్ కాలేజీ, నవోదయ పాఠశాల ఇవ్వనటువంటి బీజేపీకి పార్టీకి ఓటు ఎందుకు వేయాలి' అంటూ ప్రశ్నించారు.

**రైతుబంధు, 24 గంటల కరెంటు వద్దంటున్నరు..** 'అందుకే మిమ్మల్ని అందుకే నేను మిమ్మల్ని కోరేది. ఎలక్షన్లలో ఆగమాగం ఓటువేయొద్దు. వ్యక్తి చరిత్ర, వాళ్ల పార్టీ చరిత్ర, నడకవడిక, ప్రజలు గురించి ఎలా ఆలోచిస్తరని ఆలోచించి ఓటు వేస్తే ప్రజలు గెలుస్తారు. మీరు గెలవాలని నేను కోరుకుంటున్నా. ఇవాళ కాంగ్రెస్ రెండుమాటలు చెబుతున్నది. రైతుబంధు అవసరం లేదు.. దుబార చేస్తున్నడు కేసీఆర్ అని మాజీ పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతున్నడు. ఇప్పుడున్న పీసీసీ అధ్యక్షులవారేమో కేసీఆర్ బేకార్‌గా వేస్ట్ చేస్తున్నడు. రైతులకు మూడుగంటల కరెంటు చాలు. మొత్తం దుబారా చేస్తున్నడు అని మాట్లాడుతున్నరు.

కరెంటు కరెంటు మూడు గంటలు చాలా? 24 గంటలు కావాల్నా..? రైతుబంధు దుబారనట? నేను దుబార చేస్తున్ననట. నేను కాపోడినే. నాకు వ్యవసాయం ఉన్నది' అన్నారు.

**కాపోళ్ల బాధలు నాకు తెలుసు..** 'కాపోళ్ల బాధలు నాకేంటో తెలుసుకాబట్టి.. నేను 24 గంటల కరెంటు ఇస్తున్న. ఇష్టం ఉన్నప్పుడు రైతులు పొలం పారించుకుంటరు. మునుపు సగం రాత్రి, సగం పగలు ఇస్తే నిద్రలు కాచి.. బాయిలకాడ పండుకొని ఎంతో మంది పాములు కరిచి, కరెంటు షాక్ కొట్టి చనిపోయారు. ఇవాళ ఆ బాధ లేదు. నేను ఒక్కటే మనవి చేస్తున్నా. గ్యారంటీగా కరెంటు ఆగం చేస్తరు.. ధరణిని తీసి బంగాళాఖాతంలో వేస్తరటా? రాహుల్ గాంధీ కూడా మాట్లాడుతున్నడు. రాహుల్ గాంధీకి ఎద్దు ఉన్నదా? ఎవుసం ఉన్నదా? ఆయనకు ఏమన్న తెలుస్తదా? ధరణిని తీసి బంగాళాఖాతం వేస్తరట? మళ్లీ మీ భూములు పట్వారులు, గిర్దావర్లు.. మళ్లీ కిందిమీద చేడయం.. ఆగమాగం చేయడం' జరుగుతుందన్నారు.

**కాంగ్రెస్‌నే బంగాళాఖాతంలో వేయాలి..** 'రైతుబంధు డబ్బులు మీకు ఇస్తున్నం. దర్జాగా ఎలా వస్తున్నయ్. అక్కడ వేయంగనే టింగ్ టింగుమని ఫోన్లు మోగుతున్నయ్. ఏ పెట్టుబడికి అవసరమైతే దానికి పెట్టుకొని మంచి పంటలు తీస్తున్నరు. ధరణి తీసివేస్తే రైతుబంధు ఎలా రావాలి? రైతుబీమా ఎలా రావాలి? ధాన్యం డబ్బులు ఎలా రావాలి? మళ్లీ దళారీలు.. పహానీ నకళ్లు.. మళ్లీ మండలాఫీసుల చుట్టూ తిరుగుడు.. నీకు ఎన్ని ఎకరాలున్నది..? రూ.60వేలు వస్తే.. రూ.20వేలు ఇవ్వమంటడు.. మళ్లీ అక్కడికి వస్తుంది కదా? ఇవాళ దళారీ లేడు.. దరఖాస్తు లేదు.. ఆఫీసుకు వెళ్లే పని లేదు. మీరు కాలుమీద కాలు వేసుకొని కుసుంటే డబ్బులు వచ్చి మీ ఖాతాలో పడుతున్నయ్.

ధరణి ఉండలా లేదా? ధరణిని వేస్తామనోళ్లను ఏం చేయాలి?' ప్రశ్నించిన ఆయన.. వారినే బంగాళాఖాతంలో వేయాలన్నారు. ఆ పని చేస్తనే తెలంగాణ బాగుపడుతుందన్నారు.




**తెలంగాణపై వారికి పెత్తనమే కావాలి..** 'మనం గొడగొడ ఏడుసుకుంట వలసపోయిన నాడు ఒక్క కాంగ్రెస్, బీజేపోడు ఎవడన్నా జై తెలంగాణ అన్నడా? మన చెవులతో విన్నామా? మనం జై తెలంగాణ అంటే.. మనల్నే జైళ్లో వేశారు.

చంపారు, కొట్టారు. లాఠీచార్జీలు చేసి అనేక కేసులు పెట్టారు. వాళ్లు ఎన్నడూ అనలే. వాళ్లకు ఎందుకు కడుపునొప్పి ఉంటది ? తెలంగాణపై మళ్లీ పెత్తనం కావాలి? పచ్చపడ్డది కదా? మళ్ల కరగనాకాలి ఇగ.. ఏం లేకుంట మళ్లీ ప్రజలకు గుండుకొట్టాలి. దాని కోసమే వాళ్ల ఆరాటం తప్ప.. తెలంగాణ బతుకుల కోసం కాదు. తెలంగాణ పోరాటం కోసం కాదు.

ఏమాత్రం పొరపాటు చేసినా వైకుంఠపాళి ఆటలో పెద్దపాము మింగినట్లయితది. మళ్లీ మొదటికే వస్తం. చాలా ఇబ్బందులు వస్తయ్. దయచేసి ఆలోచించి గద్వాల అభివృద్ధి కోసం అనుక్షణం తపించే వ్యక్తి కృష్ణమోహన్‌రెడ్డి. మంచి పట్టున్న నాయకుడు. ఆయనను గతంలో కంటే పదివేల మెజారిటీ ఇచ్చి బ్రహ్మాండంగా గెలిపించాలి' అని సీఎం కేసీఆర్ కోరారు.




## భాజపా, భారాస ఒక్కటైతే.. గజ్వేల్‌లో నేనెందుకు పోటీ చేస్తా?: ఈటల

హైదరాబాద్: సీఎం కేసీఆర్ పాలనలో భారాస కార్యకర్తలకే 'బీసీ బంధు' దక్కిందని భాజపా ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. కేసీఆర్ పాలనలో దళితులు, బీసీలు, రైతులు.. ఎవరూ సంతోషంగా లేరన్నారు. అసైన్డ్, ప్రభుత్వ భూములను అమ్ముకుంటున్నారని.. రూ. లక్షల కోట్లు అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వమే స్వయంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఈటల మాట్లాడారు. భాజపా, భారాస ఒక్కటైతే తానెందుకు గజ్వేల్‌లో పోటీ చేస్తానని ఆయన ప్రశ్నించారు. భారాస పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని ఈటల అన్నారు. ఆ పార్టీని గద్దె దించడం భాజపాకే సాధ్యమని చెప్పారు. తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే కమలం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించాలని గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే వారు భారాసలో చేరారని చెప్పారు.

## కాంగ్రెస్ చిల్లర మాటలకు లొంగిపోతే ఆగమైతం: మంత్రి కేటీఆర్




సిరిసిల్ల: కాంగ్రెస్ పార్టీ చిల్లర మాటలకు లొంగిపోతే ఆగమైపోతామని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికలు రాగానే ఆగం కావొద్దని, ప్రజలు ఒక్కసారి ఆలోచించారని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ టెక్ సెల్‌వింగ్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు నేతలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో ఎటు చూసిన పచ్చదనం, సాగు నీరు, తాగునీరు, సమృద్ధిగా కరెంటు, సుభిక్షంగా పంటలు పండుతున్నాయని, కడుపునిండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా కులాల పేరుతో కుంపట్లు పెట్టలేదని, మతాల పేరుతో మంటలు పెట్టలేదని చెప్పారు. ప్రాంతం పేరుతో పంచాయతీలు పెట్టే ప్రయత్నం చేయలేదని తెలిపారు. అభివృద్ధే కులంగా, సంక్షేమమే మతంగా పరిపాలన సాగించారని వెల్లడించారు. అలాంటి నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు చాలా మంది చాలా ప్రయత్నాలు, ప్రయోగాలు చేస్తున్నారని విమర్శించారు. మన బతుకులు బాగుచేసిన, తాగు నీరు, సాగునీరు ఇచ్చి మన కండ్లముందే వ్యవసాయాన్ని బాగుచేసిన కేసీఆర్ గురించి తప్ప మరొకరి గురించి ఆలోచించాల్సి అవసరం లేదన్నారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్, బీజేపీ చేతిలో పెడితే ఆగమైతదని చెప్పారు. ఈ ఎన్నిల్లో సిరిసిల్ల నుంచి మొదలయ్యే జైత్రయాత్రతో రాష్ట్రంలో బీఆర్ఎస్ సెంచరీ దాటాలని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. సిరిసిల్ల జిల్లాలోని నాలుగు జిల్లాలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలని చెప్పారు. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. ఏది మంచి, ఏది చెడో సిరిసిల్ల ప్రజలకు తెలుసని మంత్రి కేటీఆర్ అన్నారు.



## కుక్క తోక తగిలితే కూలి పోయేలా కాళేశ్వరం దుస్థితి

హైదరాబాద్ : రూ.38 వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని కాళేశ్వరం చేపట్టారని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పేర్కొన్నారు. నేడు ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు పరిస్థితి కుక్క తోక తగిలితే కూలి పోయేలా కాళేశ్వరం దుస్థితి ఏర్పడిందన్నారు. అన్నారం పంపు హౌస్ , మేడిగడ్డ పరిస్థితిపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ వాళ్ళు నిగ్గు తేల్చారన్నారు. 20 అంశాలపై వివరణ అడిగితే 11అంశాలపై క్లారిటీ ఇచ్చారని షర్మిల పేర్కొన్నారు. బ్యారేజ్ నిర్మాణమే వేస్ట్ అని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ ఇచ్చిందని షర్మిల వెల్లడించారు. మేడిగడ్డ కు వచ్చిన ఇబ్బంది రాబోయే రోజుల్లో అన్నారం , సుందిళ్లకు ప్రమాదం రానుందని హెచ్చరించిందని తెలిపారు. కేవలం కమిషన్ల కోసమే ప్రాజెక్టుల వ్యయాన్ని భారీగా పెంచారని షర్మిల వెల్లడించారు. సేమ్ ప్రాజెక్టును రాజ శేఖర్ రెడ్డి రూ.38 వేల కోట్ల తో నిర్మాణం చేయాలని భావిస్తే దానిని కేసీఆర్ లక్ష కోట్లకు పెంచి18లక్షల ఎకరాలకు నీరు ఇస్తామన్నారని తెలిపారు. కేసీఆర్ వైఎస్ కంటే కేవలం రెండున్నర ఎకరాలకు మాత్రమే పెంచారన్నారు. అసెంబ్లీ వేదికగా సాగునీటిపై అనేక అబద్ధాలు ఆడారని షర్మిల వెల్లడించారు.

# ఈ సారికి ఇలా కానిద్దాం!



## మార్పు కోరుకుంటున్నారా..?

## ఒక్క ఛాన్స్ ఇచ్చి చూద్దాం.. టీ ఓటరు నాడి మారుతోందా..!

## కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లేనా!?

హైదరాబాద్ : ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క ఛాన్స్ ఇవ్వండి.. మీకోసం కాంగ్రెస్ అనేక త్యాగాలు చేసింది. తెలంగాణ ఇచ్చింది.. అంటూ.. కాంగ్రెస్ అగ్రనాయకులు సైతం తెలంగాణ ఎన్నికల్లో ప్రజలను చైతన్య పరిచేందుకు చేస్తున్న వాదన బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేశారు. విజయ భేరి యాత్రల్లో ఆయన ఎంత బిజీగా ఉన్నా షెడ్యూల్ ప్రకారం హాజరవుతున్నారు. వివిధ జిల్లాల్లో ఇప్పటికే ఈ యాత్రలు చేపట్టారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో ఒక్క ఛాన్స్ వాదనను మరింతలోతుగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. ఇదే విషయాన్ని పదే పదే నాయకులు కూడా చెబుతున్నా రు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో నాయకులు.. ప్రజలను మోటివేట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ఓటరు నాడి కూడా మారుతున్నట్టు తెలుస్తోంది. గత రెండు ఎన్నికల్లో కేసీఆర్‌ను ప్రజలు ఆదరించారు. అయితే.. తెలంగాణ ఇచ్చామని చెబుతున్న కాంగ్రెస్‌కు మాత్రం పరాభవం తప్పలేదు. ఈ నేపథ్యంలో తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో అయినా.. కాంగ్రెస్‌కు పట్టం కట్టాలనే మాట ఓ వర్గం ప్రజల్లో జోరుగా వినిపిస్తోంది. ఒక్క ఛాన్స్ ఇచ్చి చూద్దాం అనేమాట ఇప్పుడు తెలంగాణ ఓటరు నుంచి వినిపిస్తోంది. కొన్ని ఆన్‌లైన్ చానెళ్లు.. పత్రికలు అంతర్గతం గా చేస్తున్న సర్వేల్లోనూ ఇదే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వాదన బలంగా ప్రజల్లోకి చేరేలా.. కాంగ్రెస్ కూడా వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఎన్నికల కోసం ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు ఒక్క ఛాన్స్‌ను కూడా బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో కరపత్రాల పంపిణీతోపాటు నాయకులు కూడా ఒక్క ఛాన్స్‌పై ప్రచారం చేసేలా దిశానిర్దేశం చేస్తోంది.

తెలంగాణ ఓటరు నాడి ఇప్పుడిప్పుడే మారుతున్ననేపథ్యంలో వారిని మరింత మచ్చిక చేసుకునేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయో చూడాలి.

# సంపాదకీయం

## ఎలక్షన్ స్పెషల్

### డిపాజిట్ కోల్పోవడం అంటే తెలుసా?

దేశంలో ఐదురాష్ట్రాల ఎన్నికలకు నోటిఫికేషన్లు విడుదలవ్వడంతో మరోసారి ఎన్నికల సీజన్ స్టార్టయ్యింది. ఇప్పటికే దక్షిణాదిలో కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు ఇటీవల ముగిసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం, ఛత్తీస్ గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో... ఎన్నికలకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుసుకుందాం! ఇందులో భాగంగా... ఎన్నికల్లో డిపాజిట్ అంటే ఏమిటి.. ఆ నియమం ఎప్పటినుంచి వచ్చింది.. అది కోల్పోవడం అంటే ఏమిటి.. ఓటర్ దినోత్సవం, ఓటరు ప్రతిజ్ఞ మొదలైన విషయాలు ప్రధానంగా ఎన్నికల సీజన్ లో వినిపిస్తుంటాయి. ఇందులో ప్రధానంగా డిపాజిట్ కోల్పోవడం అనేది హాట్ టాపిక్ గా ఉంటుంటుంది. ఎన్నికల్లో పోటీచేసే వ్యక్తి నామినేషన్ పత్రం దాఖలు చేసేటప్పుడే 1951నాటి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 34(1)(ఎ) నిబంధన ప్రకారం కొంతమొత్తాన్ని డిపాజిట్ గా చెల్లించాల్సి వస్తుంది. ఇందులో భాగంగా... లోక్ సభకు పోటీ చేయాలనుకుంటే రూ. 25వేలు డిపాజిట్ చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలు రూ. 12,500 చెల్లిస్తే సరిపోతుంది. అదే శాసనసభకు పోటీ చేయాలంటే సదరు అభ్యర్థి రూ. 10వేలు కట్టాలి. ఎస్సీ, ఎస్టీలు ఐదు వేలు చెల్లిస్తే చాలు. ఇక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి.. పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు అంటే 16.6శాతం ఓట్లు సాధించ గలిగితే ఈ సొమ్ము తిరిగి ఇచ్చేస్తారు. ఈ క్రమ్మలో ఎవరికైతే ఆరింట ఒక వంతు ఓట్లు కూడా రావో.. వారు డిపాజిట్ కోల్పోయినట్లు అర్థం! అలాంటి వారికి డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇవ్వరు. దాన్ని డిపాజిట్ జప్తు చేయడం అంటారు. నామినేషన్ ఉపసంహరించుకున్నా, గెలిచినా, ఆరింట ఒక వంతు ఓట్లు సాధించినా ఈ మొత్తం వెనక్కి ఇచ్చేస్తారు. ఇదే క్రమంలో... పార్లమెంట్ ఎన్నికలకు రాష్ట్రపతి పేరుతో, రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు గవర్నర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్లు జారీ చేస్తుంది. సాధారణంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవడానికి కొన్ని వారాల ముందు ఎన్నికల షెడ్యూల్ ను ఎలక్షన్ కమిషన్ వెలువరిస్తుంది. ఆ వెనువెంటనే ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుంది. ప్రతి ఏటా జనవరి 25ని ఓటర్ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. దీన్ని 2011 నుంచి ప్రారంభించారు. ఓటర్లను కలుపుకోవడం, వారిని మెరుగైన భాగస్వాములను చేయడం అనేది ఈ దోనోత్సవ లక్ష్యం. ఇక "ఓటర్ గా ఉన్నందుకు గర్వపడుతున్నాను. ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నాను" అనేదాన్ని ఓటరు నినాదంగా ఉంది! ఇదే సమయంలో ఓటర్ల ప్రతిజ్ఞ కూడా మన ప్రజాస్వామ్యంలో పొందుపరచబడి ఉంది! ఇందులో భాగంగా... "ప్రజాస్వామ్యంలో విశ్వసనీయతకు కట్టుబడి ఉన్న భారతదేశ పౌరులైన మేము మా దేశంలో ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛ, న్యాయ, శాంతియుత ఎన్నికల గౌరవాన్ని నిలిపి ఉంచుతామని.. ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా, కులం, మతం, వర్గం, సంఘం, భాష మొదలైన ప్రలోభాలను పరిగణనలోకి తీసుకోకుండా.. వాటికి ఏమాత్రం ప్రభావితం కాకుండా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము'' అనేది భారతదేశంలోని ఓటరు ప్రతిజ్ఞ! అంటే... ఓటు వేసే ముందు ప్రతీ ఓటరూ ఈ నినాదాలను, ప్రతిజ్ఞను, ఓటు విలువను గుర్తెరిగి ఓటు వేయాలన్నమాట!

## కాంగ్రెస్ మాటల పార్టీ... బిఆర్ఎస్ చేతల పార్టీ

### అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్ పార్టీ : మంత్రి మల్లారెడ్డి





శామీర్పెట (గరుడ వార్త) : దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ చేయలేని ఎన్నో అభివృద్ధి పనులను, కేవలం సంవత్సరాల వ్యవధిలో ఎన్నో రెట్లు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసి చూపిన ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీనేనని మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం తూముకుంట మున్సిపాలిటీ పరిదిలోని దేవరయంజాల్ తదితర ప్రాంతాల్లో మంత్రి మల్లారెడ్డి భారీ రోడ్ షోతోపాటు పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడి, అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దూసుకేళ్ళలా చేసిన ఏకైక పార్టీ తెలంగాణ పార్టీ నేని అన్నారు. కాంగ్రెస్ కల్లబొల్లి మాయమాటలు నమ్మి మోసపోవద్దని, దశాబ్దాలుగా మోసపోయామని ఈసారి కూడా మేడ్చల్ ప్రజలు వాస్తవాలను ఆలోచించి కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలని మంత్రి మల్లారెడ్డి కోరారు. ప్రచారంలో మేడ్చల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ మహేందర్ రెడ్డి, తూంకుంట మున్సిపాలిటీ చైర్మన్ రాజేశ్వర్ రావు, వైస్ చైర్మన్ వాణి వీర రెడ్డి, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నరు.

## అమృత్ కాల్ కోసం పెట్టుబడి - భారతదేశంఏ100 సంవత్సరాలు

### దేశం యొక్క ఆర్థిక సౌలభ్యం కోసం ఆర్థిక అక్షరాస్యత మిక్కిలి ఆవశ్యక్యం...



శామీర్పెట (గరుడ వార్త) : అధ్యాపకుల కోసం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, అదే విదంగా విద్యార్థుల కోసం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమన్ని ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్స్ సహకారంతో హైదరాబాద్ ఐ పి ఈ శామీర్‌పేట్ క్యాంపస్‌లో "క్యాపిటల్ మార్కెట్‌లలో పెట్టుబడి" అనే అంశంపై సదస్సు నిర్వహించబడింది. తెలంగాణ ఎఫ్ డి పి, ఎఫ్ ఎల్ పి యొక్క థీమ్ "అమృత్ కాల్ కోసం పెట్టుబడి - భారతదేశంఏ100 సంవత్సరాలు" కార్యక్రమం కొరకు అధ్యాపకులు, విద్యార్థులకు వివిధ ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి, ద్రవ్యోల్బణాన్ని అధిగమించడానికి స్థిరమైన పెట్టుబడి ద్వారా భారతదేశాన్ని అమృత్‌కాల్‌కు సిద్ధం చేయడానికి క్యాపిటల్ మార్కెట్‌లు, మ్యూచువల్ ఫండ్‌లలో పెట్టుబడులు పెట్టడం యొక్క ప్రాముఖ్యతపై వివిధ సెషన్‌ల ద్వారా వివరించబడింది. ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనివాస మూర్తి, డీన్ అకడమిక్స్ ప్రొఫెసర్ వి శ్రీకాంత్, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ వై రామకృష్ణ, ప్రోగ్రామ్ కో కన్వీనర్ డాక్టర్ స్వాతి మాథుర్, ప్రోగ్రాం కో కన్వీనర్ డాక్టర్ పి కల్యాణి సమక్షంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ సదస్సులో పాల్గొనేవారి ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడానికి సెక్యూరిటీస్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్ ద్వారా పెట్టుబడి ప్రణాళికకు సెషన్‌లు అంకితం చేయబడ్డాయన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుండి 98 కళాశాలల నుండి మొత్తం 120 మంది అధ్యాపకులు మరియు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## జిల్లాలో మూడో రోజు ఏడు నామినేషన్లు దాఖలు

%మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: తెలంగాణ శాసనసభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లకు సంబంధించి మూడో రోజైన సోమవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయని మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు నామినేషన్లకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్, కూకట్పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు నామినేషన్లు సంబంధిత ఆర్వోలు స్వీకరించారని పేర్కొన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చింతల అంకాలమ్మ భరోసా పార్టీ నుంచి, కుత్బుల్లాపూర్ నుంచి దొంతుల భిక్షపతి స్వతంత్ర అభ్యర్థిగా, కూకట్పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సుధాకర్ యాదవ్, చలిక పార్వతి, చలిక చంద్రశేఖర్లు స్వతంత్ర అభ్యర్థులుగా, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్లు ఎ.దేవేందర్, బొజ్జా యాదగిరి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ మేరకు మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ కూడా రాలేదని పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

## వైద్య సేవలకు జాతీయ గుర్తింపు

ముస్తాబాద్ : వైద్య సిబ్బంది సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరచడంతోపాటు రోగులకు బాగా సేవలు అందిస్తున్నారు. ఫలితంగా తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్ట్స్ (ఎన్‌క్వాస్)కు ఎంపికైంది. కేంద్ర బృందం నిర్వహించిన సర్వేలో 91.7 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. దీనికి వరుసగా మూడేళ్లు పాటు నిధులు రానున్నాయి. వీటితో మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఏర్పడనున్నది.
నిబంధనలకు అనుగుణంగా...ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్‌క్వాస్‌కు ఎంపికయ్యే విధంగా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుమన్‌మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి శ్రీరాములు ఎప్పటికప్పుడు ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్నారు. జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సేవలు అందించే విధంగా వైద్యులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. వారి సలహాలు, సూచనలు పాటిస్తూ సిబ్బంది జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రికి వచ్చిన రోగులు, గర్భిణులు, చిన్నారులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారు. ఇక్కడికి వచ్చే రోగులను పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. పారిశుద్ధ్యం, పచ్చదనాన్ని పటిష్ఠంగా నిర్వహిస్తూ మంచి వాతావరణం కల్పిస్తున్నారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలకు సంబంధించిన చార్టులను పీహెచ్‌సీ గోడలపై ప్రదర్శించారు.

కేంద్ర బృందం పరిశీలన..

తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు మార్చి 20, 21 తేదీల్లో మొదటగా పరిశీలించారు. ప్రధానంగా ఆరోగ్య కేంద్రంలో 14 జాతీయ వైద్య సేవలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? లేదా? అనే విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓపీ, ఇన్ పేషెంట్, జనరల్ వార్డు, లేబర్‌వార్డు, డెలివరీ రూం, ఫార్మసీ అనే ఆరు అంశాలపై పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. వారు నిర్వహించిన సర్వే ఆధారంగా తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 91.7 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. జిల్లాల విభజన కాకముందు కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2016-17లో కాయకల్ప అవార్డులో మొదటి స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది.

బాగా చూస్తున్నారునేను వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చాను. ఇక్కడ అన్ని వసతులున్నాయి. వైద్యులు బాగా చూస్తున్నారు. అవసరమైన మందులు ఇస్తున్నారు. పెద్దాసుపత్రి మాదిరిగానే ఇక్కడ కూడా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. సేవలు అందుతున్నాయి.లక్ష్మి, మండెపల్లి

ప్రతి ఒక్కరి కృషి వల్లే..

జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తంగళ్లపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించడం వల్లే ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. ప్రధానంగా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక శ్రద్ధ, జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణతో సిబ్బంది బాగా పని చేశారు. ఫలితంగా 91.7 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దీని వెనుక ప్రతి ఒక్కరి కృషి ఉంది. ఏడాదికి రూ. 3 లక్షల చొప్పున మూడేళ్ల పాటు రూ. 9 లక్షలను కేంద్రం ప్రోత్సాహకంగా అందించనుంది.శ్రీరాములు, ప్రోగ్రాం అధికారి

బాధ్యత మరింత పెరిగిందినేను ఇక్కడికి వచ్చి నాలుగు నెలలు అవుతుంది. ఇక్కడ రోగులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఈ ఆసుపత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. రోజూ 60 నుంచి 70 మంది అవుట్ పేషెంట్లు వస్తుంటారు. ఇదే స్ఫూర్తితో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తాం.జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తంగళ్లపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందించడం వల్లే ఎన్‌క్వాస్‌కు ఎంపికైంది. ప్రధానంగా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక శ్రద్ధ, జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణతో సిబ్బంది బాగా పని చేశారు. దీని వెనుక ప్రతి ఒక్కరి కృషి ఉంది. స్నేహ, ఆరోగ్య కేంద్రం వైద్యురాలు

## పరిశ్రమపైనే రైతుల ఆశలు

మల్లాపూర్ : ఉమ్మడి జిల్లాలో ఏకైక వ్యవసాయ ఆధారిత కర్మాగారం ముత్యంపేట చక్కెర పరిశ్రమ. గతంలో 5 వేల మంది రైతు కుటుంబాలకు లాభాలను పంచిపెట్టి, 2 వేల మంది కార్మికులకు ఉపాధినిచ్చి, నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించింది. కూలీలకు జీవనోపాధి అందించడంతో పాటు పరోక్షంగా వేలమందికి జీవనోపాధి కల్పించింది. 32 సంవత్సరాల పాటు నిరాటంకంగా నడిచిన పరిశ్రమను లేఆఫ్ కారణంగా 2015-16 సీజన్‌లో ప్రభుత్వం మూసివేసింది. దీంతో లాభాలను కోల్పోయి రైతులు, ఉపాధి కరవై కార్మికులు పరిశ్రమను తెరిపించడానికి ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారం చేపట్టే ప్రభుత్వాలు పరిశ్రమను తెరిపిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

అనుబంధ పరిశ్రమలతో ప్రయోజనం

ముత్యంపేట చక్కెర పరిశ్రమలో అనుబంధ ఉత్పత్తులు ప్రారంభిస్తే పరిశ్రమ లాభాల బాట పడుతందని రైతులు పేర్కొంటున్నారు. పరిశ్రమ పరిధిలో వందల ఎకరాల బీడు భూములు ఉన్నాయి. దీంతో పాటు నీటి వసతి పుష్కలంగా ఉంది. ఇలాంటి పరిస్థితులలో పేపరు తయారీ, మినరల్ వాటర్, విద్యుత్తు ఉత్పత్తి, మద్యం తయారీ వంటి వాటిని ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమను కాపాడుకోవచ్చని, దీనిపై ప్రభుత్వం నిపుణుల కమిటీ వేసి సాధ్యసాధ్యాలను పరిశీలించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు పరిశ్రమను ప్రారంభించినా 4 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గకుండా చెరకును పండించగలమని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమను ప్రభుత్వం నడిపించినా, ప్రైవేటుకు అప్పగించిన తమకు అభ్యంతరం లేదని, తిరిగి ప్రారంభిస్తే చాలని రైతులు కోరుకుంటున్నారు.

ప్రతిపక్ష పార్టీల సంఘీభావం

మూసివేసిన పరిశ్రమను తెరిపించేవరకు రైతులకు అండగా ఉంటామని భాజపా, కాంగ్రెస్, తెజస, వైఎస్సార్‌టీపీ అధ్యక్షులు పేర్కొన్నారు. పరిశ్రమలకు సముచిత స్థానం కల్పిస్తామని ప్రతిపక్ష పార్టీల నాయకులు హామీ ఇస్తున్నారు. దీంతో పరిశ్రమను తెరిపించే పార్టీకి అండగా ఉండాలని రైతులు నిర్ణయం తీసుకుంటున్నారు.

ఉద్యమాల ద్వారానే సాధ్యం..మూసివేసిన పరిశ్రమను తెరిపించుకునేందుకు ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. సహకార సంఘం ద్వారా పరిశ్రమను నడిపించేందుకు రైతులు అంగీకరించడం లేదు. ముత్యంపేట పరిశ్రమ పరిధిలో పండిస్తున్న చెరకును కామారెడ్డిలోని గాయత్రీ షుగర్స్‌కు తరలించడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం వెంటనే పరిశ్రమను తిరిగి ప్రారంభించాలని రైతులందరి తరఫున కోరుతున్నా.

# 2 జిల్లాలు 10 మండలాలు

మంథని: తెలంగాణ సాగునీటి రంగానికి కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టు.. త్రిలింగ ధామమైన కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం.. చారిత్రక, పర్యాటక విశేషాల రామగిరిఖిల్లా.. సింగరేణి బొగ్గు గనులు.. వేద పండితులకు నిలయమైన మంత్రపురి.. భౌగోళికంగా అత్యధిక విస్తీర్ణం.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు కలిగిన మంథని నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రత్యేక పరిస్థితులతో ప్రాచుర్యం పొందింది. ఇక్కడి ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిగా, శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించి ఈ ప్రాంతానికి వన్నె తెచ్చారు.

రాజకీయ ఉద్దండులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే మారుమూల ప్రాంతమైన మంథని నియోజకవర్గానికి పలువురు రాజకీయ దిగ్గజాలు ప్రాతినిధ్యం వహించారు. పీవీ నరసింహారావు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం దేశ రాజకీయాల్లోకి వెళ్లి కేంద్ర మంత్రిగా, ప్రధానిగా సేవలందించారు. దుద్దిళ్ల శ్రీపాదరావు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభాపతిగా, శ్రీధర్‌బాబు నాలుగు సార్లు ఎన్నికై మంత్రిగా వ్యవహరించారు. ఇక్కడి అటవీ ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టులకు పుట్టినిల్లు. బేగంపేట,



మహాముత్తారంలలో భారీ స్మారక స్తూపాలు నాటి పరిస్థితులకు అద్దం పడతాయి. కొయ్యూరు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అయిదుగురు కేంద్ర కమిటీ సభ్యులు హతం కావడం అప్పట్లో రాష్ట్రవ్యాప్త సంచలనం. తీగలవాగు ప్రాజెక్టు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. కోవర్టు ఆపరేషన్‌లో జిల్లా కార్యదర్శి విజయ్ మృతి చెందాడు. మంథని మండలం శాస్త్రుల్లపల్లికి చెందిన మల్లా రాజిరెడ్డి కేంద్ర కమిటీ సభ్యుడుగా ఉన్నాడు.

పరిశ్రమలు.. విద్యాసంస్థలు

నియోజకవర్గంలో సింగరేణి పరిధిలో రెండు ఉపరితల బొగ్గు గనులు, భూగర్భ అడ్రియాల లాంగ్‌వాల్ షాఫ్టు ప్రాజెక్టు, తాడిచెర్లలో ఓ.ఎంఆర్ ఉపరితల గనితో పాటు సౌర విద్యుత్తు కేంద్రాలున్నాయి. రామగిరి మండలం సెంటినరీకాలనీలో జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల, కాటారంలో పాలిటెక్నిక్ కళాశాల, మంథని, మహదేవపూర్‌లలో డిగ్రీ కళాశాలలున్నాయి. మంథనికి చెందిన ఎంతో మంది విద్యావంతులు దేశ విదేశాల్లో సేవలందిస్తున్నారు. అమెరికా, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, జర్మనీ, గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు.

ఉమ్మడి జిల్లాలోనే అతి పెద్దది

మంథని నియోజకవర్గానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఈ రాష్ట్రాలను కలుపుతూ గోదావరి, ప్రాణహిత నదులు ప్రవహిస్తున్నాయి. విస్తీర్ణంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అతి పెద్ద నియోజకవర్గంగా గుర్తింపు పొందిన మంథని రెండు జిల్లాల్లో, 140 చదరపు కిలోమీటర్లలో విస్తరించింది. మొత్తం 10 మండలాలకు గాను పెద్దపల్లి జిల్లా పరిధిలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాలు, జయశంకర్ భూపాలపల్లిలో మల్హర్, కాటారం, మహాముత్తారం, పలిమెల, మహదేవపూర్ మండలాలున్నాయి. మంథని, పెద్దపల్లి, భూపాలపల్లి మూడు డివిజన్లు ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో 84, భూపాలపల్లి జిల్లాలో 123 రెవెన్యూ గ్రామాలున్నాయి. పెద్దపల్లిలో 99, భూపాలపల్లిలో 89 పంచాయతీలున్నాయి. పెద్దపల్లి జిల్లాలో 158, భూపాలపల్లి పరిధిలో 130 పోలింగ్ కేంద్రాలున్నాయి.

15 సార్లు ఎన్నికలు

1952లో ఏర్పడిన మంథని నియోజకవర్గంలో ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. మొదటి ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ అభ్యర్థి విజయం సాధించగా, తదుపరి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందింది. తెదేపా, తెరాస అభ్యర్థులను ఒక్కోసారి విజయం వరించింది. పి.వి.నరసింహారావు, దుద్దిళ్ల శ్రీపాదరావులు మూడు సార్లు, శ్రీధర్‌బాబు నాలుగు సార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించారు. ఇక్కడి నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు విప్‌గా, మంత్రిగా, శాసనసభాపతిగా, ముఖ్యమంత్రిగా పదవులు పొందారు.

# ఓటరు కార్డులు అందేదెట్లా?

హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా కొత్త ఓటరు కార్డుల పంపిణీ హాస్యాస్పదంగా మారుతోంది. 18 ఏళ్లు నిండిన వారితోపాటు కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి హాలోగ్రామ్‌తో ఉన్న కార్డులు ఎన్నికల సంఘం అందిస్తోంది. గ్రేటర్ వ్యాప్తంగా 120 తపాలా కార్యాలయాల పరిధిలో ఉన్న ఏడు లక్షల మందికి స్పీడ్ పోస్టు ద్వారా ఓటుకార్డులు పంపిణీ చేస్తున్నారు. నేరుగా ఓటర్‌కే కార్డు అందిచడంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీ, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లలో కార్డులు పంపిణీలో సమస్య ఎక్కువగా ఉంది. అంతస్తుల్లోకి సిబ్బందిని అనుమతించకపోవడంతో కార్డులు వెనక్కి తీసుకెళ్తున్నారు.



ఈసేవా కేంద్రాల్లో నో... ఈసేవా కేంద్రాల్లో ఓటు కార్డు అందుబాటులో లేకపోవడంతో ఎన్నికలు అయిపోయినా కార్డులు అందే పరిస్థితి లేదు. పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, గ్యాస్ కనెక్షన్లు, వంటి వాటి కోసం దీనిని గుర్తింపు కార్డుగా వినియోగించుకునే అవకాశం ఉంది. దీంతో చాలామంది ఈ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల కార్డుల్లో 25 లక్షలు పంపిణీ చేశారు. ఇందులో 8 లక్షల కార్డులు గ్రేటర్‌లోనే పంపిణీ చేయాల్సి ఉంది.

ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఉంటే..తెలంగాణ ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తే కార్డు నంబరు, పోలింగ్ కేంద్రం వివరాలు డౌన్‌లోడు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఓటు కార్డు లేకపోయినా ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు, వ్యక్తిగత గుర్తింపు కార్డులతో ఓటు వేసే అవకాశం ఉందన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి ...

**వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించిన మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్**



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో: కేంద్ర ఎన్నికల సంఘం నుండి వచ్చిన వ్యయ నియంత్రణ బృందం నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ ఎలక్షన్ కమీషనర్ ఎస్ ఎచ్ అజయ్ బదూ , రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ఉన్నతాధికారులతో కలిసి పాల్గొనగా, సోమవారం నాడు హైదరాబాద్ లోని రాష్ట్ర ఎన్నికల కమీషన్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఎన్నికల అధికారులు శ్రీనివాస మూర్తి, నర్సింహ, కృష్ణారెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల అధికారి వారితో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలు పాటిస్తున్నామని జిల్లా వ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని వీడియో సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు అధికారులు, పోలీసులు మొత్తం రూ. 43, 62, 23, 331 (నలభై మూడు లక్షల అరవై రెండు లక్షల ఇరవై మూడు వేల మూడు వందల ముప్పై ఒక్క రూపాయలు) నగదు, బంగారం సీజ్ చేసినట్లు తెలిపారు. అందులో రూ. 18, 95,31,161 ( పద్దెనిమిది కోట్ల తొంభై ఐదు లక్షల ముప్పై ఒక్క వేల ఒక్క వంద అరవై ఒక్క రూపాయలు) నగదును, రూ. 24,66,92,170 (ఇరవై నాలుగు కోట్ల అరవై ఆరు లక్షల తొంభై రెండు వేల ఒక్క వంద డెబ్బై రూపాయల) విలువ గల ఆభరణాలు, 1,24,098 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అలాగే ఎక్సైజ్ శాఖకు సంబంధించి 645 కేసులు నమోదయ్యాయని...321 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసుల్లో జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులు అన్ని రకాల ధ్రువపత్రాలు పరిశీలించి అన్ని రకాల ఆధారాలు సరిగ్గా ఉన్న కేసులకు సంబంధించి రూ.13,18,81,448 నగదుకు గాను రూ. 8,69, 30, 114 అప్పగించినట్లు సరైన ఆధారాలు లేని రూ.4,25(నాలుగు కోట్ల ఇరవ్య ఐదు లక్షల ) ఉన్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. దీంతో పాటు గ్రీవెన్స్ కమిటీకి సంబంధించి వచ్చిన కేసులను పరిశీలించి సరైన ఆధారాలు ఉంటే వాటిని డిస్పోజ్ చేసినట్లు తెలిపారు.

అలాగే ఆయా కేసులలో ఇన్కమ్ ట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్, జీఎస్టీ వారికి సమాచారం అందించి కేసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇన్కమ్ ట్యాక్స్, జీఎస్టీ, కమర్షియల్ ట్యాక్స్ అధికారుల తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్స్, తదితర బృందాలతో ఇప్పటికే మూడుసార్లు ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహిచామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లాలో తనిఖీల సమయంలో రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు తదితరాలు లభించినట్లయితే ఇన్కం ట్యాక్స్ వారికి పంపిస్తున్నామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా, పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఈ విషయంలో పోలీసులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎంతో బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తిస్తున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్లో అధికారులకు తెలిపారు.

# అక్రమంగా మద్యం నిలువ ఉంచిన, తరలించిన కఠిన చర్యలు....

గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : రాష్ట్ర శాసనసభ ఎన్నికల దృష్ట్యా జిల్లా ప్రొబిషన్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ప్రొబిషన్ ఎక్సైజ్ అధికారి మాధవయ్య ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ మండలం అత్వెల్లి జాతీయ రహదారి పై పోలీస్ బృందం, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఈఓ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనలలో అక్రమంగా మద్యం తరలించిన, లేదా నిల్వ ఉంచిన కఠిన చర్యలు తప్పవని అన్నారు. ప్రజలందరూ అక్రమ మద్యం గుర్తించడానికి వీరిట్ (%VERIT%) యాప్ మొబైల్ లో డౌన్లోడ్ చేసుకోవాలని,అలాగే పిర్యాదులు చేయడానికి 18004252523 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం ఇవ్వగలరని తెలిపారు. వాహనాల



తనిఖీ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ నర్సిరెడ్డి, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సిఐ యాదయ్య, మేడ్చల్ ఎక్సైజ్ సిఐ నవనీత,ఎక్సైజ్ ఎస్ ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఫామ్ హౌస్ నిర్వాహకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

## మేడ్చల్ జోన్ ఎస్ ఓ టి, షామీర్పేట్ పోలీసులు.



శామీర్పేట (గరుడ వార్త) : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫామ్ హౌస్ నిర్వాహకులందరూ ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు తప్పక అనుసరించాలని మేడ్చల్ జోన్ స్పెషల్ ఆపరేషన్ టీంతో పాటుగా షామీర్పేట పోలీస్ వారు సూచించారు. ఈ పోలీస్ బృందం సోమవారం షామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ఫామ్ హౌస్ ల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు, కాగా వారి ఆకస్మిక తనిఖీల్లో ఎటువం టి అనుమానస్పద కార్యకలాపాలు సదరు ఫామ్ హౌస్ ల్లో గుర్తించబ డలేదన్నారు. అయితే ఎవరైనా ఫామ్హౌస్ నిర్వాహకులు ఎన్నికలకు కోడ్ను ఉల్లంఘిస్తే, చట్టపరమైన చర్యలు తప్పవని శామీర్పేట పోలీసులు హెచ్చరించారు.

# యాసంగిపై ఆశలు



ఆదిలాబాద్ : యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే.. ఈ ఏడాది భూగర్భ జలాలు పైనే ఉన్నాయి. ప్రస్తుతం జిల్లా భూగర్భజల సగటు నీటి మట్టం 3.12 మీటర్ల లోతులోనే ఉన్నాయి. బోర్లు, బావుల్లో సరిపడా నీరుండటంతోపాటు జిల్లాలోని జలాశయాల్లో సాధారణ నీటి మట్టానికంటే ఎక్కువే ఉండటంతో సాగు నీటికి ఢోకా లేదని అధికారులు అంటున్నారు. విద్యుత్తు సరఫరా సక్రమంగా ఉంటే సాధారణ సాగును మించి పంటలు సాగు అయ్యే అవకాశం ఉంది.

జిల్లాలో ఏటా యాసంగిలో లక్ష ఎకరాల్లో పంటలు సాగవుతాయి. గతేడాది 1.08 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అలాంటిది ఈ సీజన్‌లో మరో 10 వేల ఎకరాల్లో అదనంగా సాగయ్యే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు. జిల్లా సాధారణ వర్షపాతం 1070.1 మి.మీలు కాగా 1214.9 మి.మీలు కురిసింది. జిల్లాలోని ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండటంతో బోర్లు, బావుల్లో సాగు అవసరాల మేరకు భూగర్భజలాలు అందుబాటులో ఉన్నాయి. మే నెలలో 8.86 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం ఆగస్టు, సెప్టెంబరు నెలలో మూడు మీటర్లకు చేరుకున్నాయి. అక్టోబరు నెల సగటు భూగర్భజలమట్టం 3.12 మీటర్లు ఉంది

జైనథ్ మండలంలో మే నెల భూగర్భ జల మట్టం 14.85 మీటర్లు ఉండగా.. అక్టోబరులో 3.20 మీటర్లకు చేరుకుంది. మండలంలో సాత్నాల ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్టు కింద 24 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. యాసంగిలో సాగు చేసే శనగ పంటకు రెండు, మూడు తడులు ఈ ప్రాజెక్టు నుంచి అందుతాయి. ఈ ఏడాది ప్రాజెక్టు నిండుగా ఉండటంతో పంట చివరి వరకు సాగు నీరు అందుతుందనే భరోసాలో రైతులు ఉన్నారు.

గుడిహత్నూరు మండలంలో మే నెలలో 18 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలం అక్టోబరుకు వచ్చేసరికి 2.40 మీటర్ల లోతులో ఉన్నాయి. వర్షాకాలంలో అధికంగా వర్షాలు కురవడంతో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహించాయి. భూగర్భజలమట్టం పెరిగింది. ఈ మండలంలో యాసంగిలో కూరగాయల సాగు ఎక్కువగా ఉంటుంది. బోర్లు, బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉండటంతో రైతులు సాగుపై ఆశతో ఉన్నారు. ఇంద్రవెల్లి మండలంలో మే నెలలో 13.40 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలాలు అక్టోబరు వచ్చే సరికి 5.55 మీటర్లకు చేరుకుంది. ఇచ్చోడ మండలంలో 25 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం ప్రస్తుతం మూడు మీటర్ల లోతులో ఉన్నాయి. సగటున జిల్లాలోని మండలాల్లో భూగర్భజలాలు పైపైనే ఉండటంతో శనగ సాగు వైపు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

# శిక్షణ ముగిసింది.. ఆచరణే మిగిలింది

సూర్యాపేట : ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులకు విధులు కేటాయించారు. ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వర్తించేలా జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కింది స్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించేలా కార్యాచరణ రూపొందించారు. ఓటరు నమోదు నుంచి పోలింగ్, లెక్కింపు వరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం విధులు పకడ్బందీగా చేపట్టి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ఎన్నికల జిల్లా అధికారి నుంచి బీఎల్‌వోల వరకు సమన్వయ ంతో విధులు నిర్వర్తిస్తున్నారు.

కేటాయింపులు మొదలుకుని శిక్షణ

ఎన్నికల జిల్లా అధికారిగా కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఓటరు నమోదు కార్యక్రమం నుంచి పోలింగ్ నమోదు వరకు అన్ని బాధ్యతలు ఆయన ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. డివిజన్, మండల అధికారులు, బీఎల్‌వోలకు విధుల కేటాయింపు మొదలుకుని వారికి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. నిత్యం సమీక్షల ద్వారా అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఆయనదే కీలకంగా వ్యవహరించనున్నారు.



పక్కా పర్యవేక్షణ

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నలుగురు రిటర్నింగ్ అధికారులను (ఆర్వో) నియమించారు. ఆయా నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు సజావుగా జరిగేలా నిత్యం పర్యవేక్షిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ మొదలు పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు వారిదే బాధ్యత.

కేంద్రం బాధ్యత

జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు నియోజకవర్గాలలో 2940 మంది ప్రిసైడింగ్ అధికారులు(పీవో), అదనపు ప్రిసైడింగ్ అధికారు(ఏపీవో)లను నియమించారు. సంబంధిత అధికారులకు ఇటీవల శిక్షణ పూర్తి చేశారు. పోలింగ్‌కు సంబంధించి అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. ఆ కేంద్రం పూర్తి బాధ్యత ఆయనపై ఉంటుంది. ఓటింగ్ ముగిసిన తర్వాత యంత్రాలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు. వీరికి సాయంగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. వీరితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులుంటారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి పని చేయాల్సి ఉంటుంది.

మౌలిక వసతుల కల్పన

జిల్లా వ్యాప్తంగా 125 మంది సెక్టార్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే బాధ్యత సెక్టార్ అధికారిపై ఉంటుంది. ర్యాంపు ఏర్పాటు, విద్యుత్తు, తాగునీరు, మౌలిక వసతులు కల్పించే విధంగా చూస్తారు. అంతేకాకుండా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా ఇప్పటికే శిక్షణ పొందారు. పోలింగ్ రోజున యంత్రాలు సరిగా పని చేయకపోతే వాటి స్థానంలో రిజర్వ్‌లో ఉన్న యంత్రాలను ఉన్నతాధికారుల సూచన మేరకు తరలించే బాధ్యతలు చేపట్టనున్నారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రంతోపాటు పరిసరాల్లో శుభ్రంగా, ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి. పోలింగ్ సమయంలో ఎలాంటి పొరపాటు జరిగినా వారిదే బాధ్యత.

# తీరు మారని మిల్లర్లు!

పెబ్బేరు : జిల్లాలోని బియ్యం మిల్లుల యజమానులపై కలెక్టర్ కన్నెర్రజేసినా వారిలో మార్పు రావడం లేదు. 2022- 2023కు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం 158 మిల్లులకు కేటాయించారు. 56 బియ్యం మిల్లుల యజమానులు ఎఫ్‌సీఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు బియ్యం గింజ కూడా ఇవ్వలేదని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఇటీవల మిలర్ల సమావేశంలో తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాలను పట్టించుకోని మిల్లుల యజమానులు సీఎంఆర్ ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. పేదల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసుకుని రీసైక్లింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికే అప్పగిస్తున్నారు. జిల్లాలో భారీగా సీఎంఆర్ ధాన్యం తరలిపోవడం, రేషన్ బియ్యం మిల్లుల్లో నిల్వ చేసుకోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పెబ్బేరులో ఈనెల ఒకటో తేదీన 1,190 బస్తాల సీఎంఆర్ ధాన్యం పట్టుబడటమే ఇందుకు ఉదాహరణ.

ధాన్యం కేటాయింపులు ఇలా..

జిల్లాలో ప్రస్తుతం వరి ధాన్యం మర ఆడించే రా మిల్లులు 145, బాయిల్డ్ మిల్లులు 13 ఉన్నాయి. వీటిలో 2021-22 వానాకాలంలో 2,44,569 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం కేటాయించింది. 1,63,861 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి. 1,56,841 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. గడువు ముగిసినప్పటికీ సంబంధిత మిల్లులపై చర్యలు లేవు.

2021-22 యాసంగిలో 1,38,878 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు ప్రభుత్వం కేటాయించింది. 93,048 మెట్రిక్ టన్నులు సీఎంఆర్ బియ్యం తిరిగి ఇవ్వాలి. ప్రస్తుతం 86,228 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. 2022-23 వానాకాలంలో 2,56,243 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు ప్రభుత్వం కేటాయించగా 1,71,682 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలి. ఇప్పటికీ 36,090 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన వాటిలో 56 బియ్యం మిల్లులు గింజ కూడా ఇవ్వకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పది రోజుల్లో ఒక్కో మిల్లు నుంచి రోజుకు 6 ఏసీకేలు ఎఫ్‌సీఐకి ఇవ్వాలని ఆదేశించారు.

మిల్లులకు పీడీఎస్ బియ్యం?

సీఎంఆర్ ధాన్యం ఇతర రాష్ట్రాలకు చేరవేస్తూ.. పేదల నుంచి ఇతరులు కొనుగోలు చేసి తీసుకొచ్చిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా మిల్లులో నిల్వలు చేసుకుంటున్నారు. ఈ బియ్యాన్ని మిల్లులకు తీసుకెళ్తుండగా పలు ప్రాంతాల్లో పట్టుబడిన ఉదంతాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పెబ్బేరు కేంద్రంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్‌లో ఉండే బియ్యం మిల్లులకు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పెబ్బేరు జాతీయ రహదారిపై పోలీసులకు పట్టుబడుతున్న కేసులు చాలా ఉన్నాయి. ఈనెల 1న వనపర్తి మండలం చిట్యాలలోని ఓ బియ్యం మిల్లు నుంచి రెండు లారీల్లో 1,190 బస్తాల సీఎంఆర్ ధాన్యం కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు తరలిస్తుండగా పెబ్బేరు పోలీసులు పట్టుకుని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. మిల్లు యజమానితో పాటు ఇద్దరు దళారులు, డ్రైవర్లపై వనపర్తి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గతేడాది నవంబర్ 13న రంగారెడ్డి జిల్లా చేవేళ్ల నుంచి 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఓ బియ్యం మిల్లుకు తరలిస్తుండగా పెబ్బేరు పట్టణంలో పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.

# నాడు ఘనకీర్తి.. నేడు త్యాగ నిరతి

తాండూరు: తాండూరు కాంగ్రెస్‌లో 1969 నుంచి 2014 ఎన్నికల వరకు 11 సార్లు మహారాజుల కుటుంబానికి చెందిన నాయకులే అభ్యర్థులుగా పోటీ చేశారు. వరుసగా 6 సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఏడు, ఎనిమిదో సారి జరిగిన ఎన్నికల్లో ఓడి పోయారు. తొమ్మిదోసారి విజయం సాధించారు. పది, పదకొండో సారి జరిగిన ఎన్నికల్లోనూ ఓటమిని చవి చూశారు. తర్వాతనుంచి ఎన్నికలకు దూరంగా ఉంటున్నారు. అయితే పార్టీ అభ్యర్థులకు మాత్రం ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

మాణిక్‌రావు వరుస విజయాలు

1969లో జరిగిన ఉప ఎన్నికతో మహారాజుల కుటుంబం నుంచి ఎం.మాణిక్‌రావు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. 1972 (ఏకగ్రీవం), 1978, 1983లో జరిగిన ఎన్నికల్లోనూ ఆయన వరుసగా గెలుపు అందుకున్నారు. 1985, 1989 ఎన్నికల్లో మాణిక్‌రావు సోదరుడు ఎం.చంద్రశేఖర్ రావు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్నికల్లో అపజయమే లేకుండా సాగిపోతున్న మహారాజుల కుటుంబంలో వచ్చిన రాజకీయ విభేదాల కారణంగా 1994, 1999



ఎన్నికల్లో ఓడిపోయారు. 2004 ఎన్నికల్లో విభేదాలను మరచి అందరూ ఒక్కటై పోయారు. ఆ ఎన్నికల్లో మాణిక్‌రావు రెండో సోదరుడు ఎం.నారా యణరావు విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో మాణిక్ రావు కుమారుడు ఎం.రమేష్ మహరాజ్ పోటీ చేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో ఎం.నారాయణరావు రెండోసారి పోటీ చేసి ఓడిపోయారు.

చివరిక్షణంలో వైదొలిగారు

2018 ఎన్నికల్లో మహారాజుల కుటుంబంలోని రమేష్ మహరాజ్ చివరి క్షణంలో తప్పుకున్నారు. సీటును పి.రోహిత్‌రెడ్డికి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరారు. ఆ ఎన్నికల్లో రోహిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2023 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి మహారాజుల కుటుంబం ప్రాతినిథ్యం లేనట్లే. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడానికి డీసీసీబీ అధ్యక్షుడు బుయ్యని మనోహర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం ఖరారు చేయడంతో ఆయన ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో మహారాజ్‌ల కుటుంబం ఎన్నికల బరిలో ప్రచార బాధ్యతలతోనే సరిపెట్టినట్లవుతోంది.

# సర్కారు భూములకు దశాబ్ది సంపద

పెద్దపల్లి : జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణానికి సేకరించిన భూముల ఆలనా పాలనా కరవైంది. పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. విలువైన భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయి.ప్రజావసరాల కోసం సేకరించిన భూములకు హద్దులు తేల్చడంతో సంబంధిత శాఖలు తాత్సారం చేస్తున్నాయి. ఇదే అదనుగా ఆక్రమణదారులు ఇష్టారీతిగా హద్దులు తొలగిస్తున్నారు. ఈ క్రమంలో భూ సేకరణ జరిపిన స్థలాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. జిల్లాలో ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి, కాళేశ్వరం జలాశయాల కోసం సేకరించిన భూముల్లో 'దశాబ్ది సంపద వనాలు' పేరిట మొక్కల పెంపకం చేపట్టాలని నిర్ణయించింది. మొక్కలు నాటి చుట్టూ కంచె నిర్మించారు. నీటి తడులు అందిస్తున్నారు.

ఆదాయం పంచాయతీలకే..

భూ సేకరణ జరిపిన ఖాళీ స్థలాల్లో ఆదాయం సమకూర్చే మొక్కలకు ప్రాధాన్యమిచ్చారు. మామిడి, అల్లనేరేడు, జామ, టేకు, వేప, చింత, నెమలినార వంటి మొక్కలు నాటారు. మూడేళ్ల తర్వాత మొక్కల సంరక్షణ బాధ్యతను సంబంధిత పంచాయతీలు తీసుకోవాల్సి ఉంటుంది. సంపద వనాల ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీలకు వస్తుంది. దీంతో మొక్కల సంరక్షణపై పంచాయతీల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. నామమాత్రంగా కాకుండా మొక్కల పెంపకంపై అధికారులు చిత్తశుద్ధితో పర్యవేక్షిస్తున్నారు.

శాఖల ఉదాసీనత

ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు ఖాళీగా ఉండటంతో కబ్జాదారుల ఆగడాలు మితిమీరుతున్నాయి. భూముల పరిరక్షణలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. ప్రాజెక్టులు, కాలువల అవసరాలు పోగా మిగిలిన ఖాళీ స్థలాలను పరిరక్షించేందుకు ఈ ఏడాది దశాబ్ది సంపద వనాల పెంపకానికి శ్రీకారం చుట్టారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో నిధులు కేటాయించారు. ముందుగా ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయో వివరాలు సేకరించారు. ఆయా భూముల్లో మొక్కలు పెంచుతున్నారు. ఉపాధిహామీలో నిర్వహణ జిల్లాలో పాలకుర్తి మండలం కుక్కలగూడూరులో 1, అంతర్గాం మండలం గోలివాడలో 2, ఎల్లంపల్లిలో 3, ధర్మారం మండలం మల్లాపూర్‌లో 2, సాయంపేటలో 1, మేడారంలో 2, మంథని మండలం సిరిపురంలో 3, గుంజపడుగులో 1, ఉప్పట్లలో 1 చొప్పున కలిపి 16 చోట్ల ఖాళీ స్థలాలను గుర్తించారు. మొత్తం 45.15 ఎకరాల్లో 26,265 మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ, నిర్వహణ బాధ్యతను మూడేళ్ల పాటు ఉపాధిహామీలో భాగంగా చేపడతారు. మొక్కల చుట్టూ కంచె నిర్మాణానికి గ్రామంలోని 'హరిత నిధి' నిధులు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, అటవీ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధజిల్లాలో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారుల సహకారంతో దశాబ్ది వనాల పెంపకం కోసం ఖాళీ స్థలాలను గుర్తించాం. నాటిన ప్రతి మొక్క సంరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పంచాయతీలు కూడా మొక్కల పెంపకంలో భాగస్వాములై కాపాడుకోవాలి.శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

# వైరాలు సమసి.. శాంతి వెల్లివిరిసి



ఖమ్మం : గతంలో ఆ గ్రామాల్లో ఎన్నికలంటేనే వణుకు పుట్టేది.. ఆవేశకావేశాలు హద్దులు దాటేవి.. కక్షలు కత్తులు నూరేవి. ఆ కత్తులు ప్రత్యర్థులపై కోలాటం చేసేవి. నెత్తురు దుస్తుల్ని తడిపేసేది.. మొత్తంగా ఏ మూలన ఏం వివాదం భగ్గుమంటుందో అనే భయం.. ఏ వైపు నుంచి ఏ రాయి వచ్చిపడుతుందో అనే కలవరం ఓటింగ్ నాడు ప్రశాంతతను భగ్నం చేసేవి.. సామాన్యుడు భయంభయంగా వచ్చి ఓటేసేవారు.. ఇంకొందరు ఎందుకొచ్చిన 'గొడవ' అని మిన్నకుండేవారు. అలాంటి పల్లెల్లో ఇప్పుడు వైరాలు సమసిపోయాయి. పగలు అదృశ్యమయ్యాయి. తాత్కాలిక కోపాలే తప్ప వీరావేశాలు కనుమరుగయ్యాయి. పోలీసుల శ్రమ, చదువు తెచ్చిన మార్పు, పార్టీల్లో పరిణతి ప్రశాంతతను తిరిగొచ్చేలా.. ప్రజలకు తిరిగిచ్చేలా చేశాయి.. ఉభయ జిల్లాల్లో సంఖ్యాపరంగా రాజకీయ సమస్యాత్మక గ్రామాల్లో తగ్గుదలే ఇందుకు నిదర్శనం.

ఖమ్మం గ్రామీణం మండలంలోని గూడూరుపాడు గొడవలకు నిలయంగా ఉండేది. 2014లో పోలింగ్ ఏజెంట్పై దాడి జరిగింది. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2016, 2018 ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోలేదు.

కూసుమంచి మండలంలోని చేగొమ్మ సమస్యాత్మక గ్రామం. కొన్నేళ్లుగా ఎలాంటి అలజడి చోటుచేసుకోవటం లేదు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. గత అనుభవాల నేపథ్యంలో పోలీసులు ఇంకా సమస్యాత్మక గ్రామంగా గుర్తించారు. మండల పరిధిలోని గన్నవరంలో దశాబ్దన్నర క్రితం పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం ఉండేది. 2001లో సర్పంచి ఎన్నికల ఫలితాల అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఓ పార్టీ కార్యకర్త హత్యకు గురవటంతో 28మందిపై హత్య కేసు నమోదైంది. అప్పటి నుంచి నాలుగు పర్యాయాలు అసెంబ్లీ, మూడు పర్యాయాలు స్థానిక ఎన్నికలు జరిగినా గొడవల్లేవు.

ఏన్కూరు మండలం తిమ్మారావుపేటలో 1993 ఎన్నికల్లో రాజకీయ ఘర్షణలు తీవ్రంగా జరిగాయి. విధుల్లో ఉన్న ఎస్సై బావిలో పడి మృతిచెందాడు. కానీ నేడు ప్రశాంతంగా ఉంది.

కొణిజర్ల మండలంలోని తనికెళ్ల, కొణిజర్ల, కొండవనమాల, చిన్నమునగాల, పెద్దమునగాల, బస్వాపురం, తుమ్మలపల్లి, కాచారం, రామనర్సయ్యనగర్లో ఒకప్పుడు ఎన్నికలంటే కత్తిమీద సాము.

జూలూరుపాడు మండలం పాపకొల్లులో రెండు దశాబ్దాల క్రితం వరకు ఎన్నికలంటే భయపడే పరిస్థితి.

సత్తుపల్లి మండలం రామానగరంలో 20 ఏళ్ల క్రితం అసెంబ్లీ ఎన్నికల సమయంలో గొడ్డళ్లతో దాడులు చేసుకోగా ఒకరు మృతి చెందారు. మరో పది మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. రెండు దశాబ్దాల్లో ఎంతో మార్పు వచ్చింది. ఇప్పుడు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

తల్లాడ మండలంలోని అన్నారుగూడెంలోనూ ఇరవై ఏళ్ల క్రితం ఎన్నికల ఘర్షణల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల కట్టుదిట్టమైన చర్యలతో పదిహేనేళ్లుగా ఆ ప్రాంతంలో ఎలాంటి ఘర్షణలు జరిగిన దాఖలాలు లేవు.ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, ఎర్రుపాలెంలో గతంలో రాజకీయ ఘర్షణ వాతావరణం నెలకొనేది. కానీ నేడు ఈ గ్రామాల్లో కొట్లాటలు లేవు. ఎవరి ప్రచారం వారు చేసుకుంటూ సామరస్యంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నారు.మధిర మండలం ఖమ్మంపాడు, కృష్ణాపురం గ్రామాల్లో పోలింగ్ అంటే ఘర్షణలే అన్న పరిస్థితులుండేవి. నేడు ఈ రెండు గ్రామాల ప్రజలు అత్యంత ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల క్రతువులో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.రఘునాథపాలెం మండలం పాపటపల్లిలో గతంలో ఎన్నికల సమయంలో తీవ్ర పోటీ నెలకొనేది. కానీ ప్రస్తుతం పూర్తి ప్రశాంతంగా మారిపోయింది. గత రెండు ఎన్నికల నుంచి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు.రఘునాథపాలెంలో రాజకీయ పోటీతో ఘర్షణ వాతావరణం ఉండేది. ప్రస్తుతం తాత్కాలిక ఆవేశాలు తప్ప రాజకీయ ఘర్షణలకు తావులేదు.

# గమ్యం తెలపని ఆర్టీసీ యాప్




హైదరాబాద్ : గత నెల 29న రాజమహేంద్రవరం–హైదరాబాద్ సర్వీసు నంబరు 2043 బస్సు సమాచారం కోసం ప్రయాణికుడు రాజమహేంద్రవరం శివార్లలో ఒక బస్టాపు దగ్గర వేచి చూస్తూ గమ్యం యాప్ ద్వారా సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేశాడు. కాని బస్సు యాప్‌లో ట్రాక్ కాలేదు. ఇదే పరిస్థితి ఇటునుంచి నగరం నుంచి వెళ్తున్నప్పుడు కూడా ఎదురవుతోందని ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నారు. నగరంలో ఆర్డినరీ బస్సులు, పల్లెలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులు మినహా అన్నిటికీ బస్సు ట్రాకింగ్ సదుపాయం కల్పించామని ఆర్టీసీ చెబుతోంది. బస్సు ఎక్కడుంది.. ఎప్పుడు బస్టాపునకు వస్తుంది.. సమచారం 'గమ్యం' యాప్ ద్వారా తెలుసుకోవచ్చని ప్రకటించింది. కాని సమాచారం ప్రయాణికులకు అందడంలేదు.

అత్యాధునిక ఫీచర్లతో బస్సు ట్రాకింగ్ యాప్ 'గమ్యం'ను టీఎస్ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. దూరప్రాంతాలకు వెళ్లే బస్సులన్నిటికీ 'ట్రాకింగ్' సదుపాయం కల్పించారు. విమానాశ్రయానికి వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సులు మినహా మిగతా బస్సుల సమాచారం తెలియడం లేదని పలువురు వాపోతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో..

బస్సు ట్రాకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఎలా పనిచేస్తుందనేది పరిశీలించడంలేదు. కొంతమంది ఆర్టీసీ అధికారులకు ఫోన్‌చేస్తే.. కొన్ని బస్సుల అనుసంధానం జరగలేదని చెబుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులు, కార్ల సమాచారం సులభంగా తెలుస్తున్నా.. ప్రజారవాణాలో అగ్రభాగంలో ఉన్న ఆర్టీసీ బస్సుల సమాచారం తెలిపే 'గమ్యం' యాప్ సక్రమంగా పనిచేయకపోవడం విశేషమే.

# ఈ వైరస్‌తో తలనొప్పే

హైదరాబాద్ : పగలు వేడి.. రాత్రి చల్లని వాతావరణంతో వైరల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఇన్‌ఫ్లూయెంజా ఏ, బీ వైరస్‌లు దాడిచేస్తున్నాయి. స్వైన్‌ఫ్లూ కేసులు సైతం పెరుగుతున్నాయి. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. దసరా సెలవుల అనంతరం కేసుల సంఖ్య మరింత పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. ఓపీలో వంద మంది వరకు వస్తే.. అందులో సగం మందికి ఇవే లక్షణాలుంటు న్నాయి. సికింద్రాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలోని పల్మనాలజీ విభాగానికి నిత్యం 80 మంది వరకు ఓపీకి వస్తుంటే.. 40 మందిలో ఈ తరహా లక్షణాలున్నాయని అక్కడ వైద్యులు చెబుతున్నారు. కరోనా థర్డ్‌వేవ్‌లో చాలామందిని ఇబ్బంది పెట్టిన ఒమిక్రాన్‌లో కూడా ఇవే తరహా లక్షణాలుంటాయని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఒమిక్రాన్ పరీక్షల్లో మాత్రం నెగెటివ్ కనిపిస్తోందన్నారు. బాధితుల్లో రెండు, మూడు రోజులు తీవ్ర జ్వరం, దగ్గు, ఆయాసం తదితర లక్షణాలు కనిపిస్తున్నాయి. జ్వరం తగ్గుతున్నా.. ఆయాసం, దగ్గు, పిల్లికూతలు దీర్ఘకాలికంగా వేధిస్తున్నాయి. దీంతో చాలామంది భయంతో వైద్యులను సంప్రదిస్తున్నారు. చెస్ట్ ఎక్స్‌రే, సీటీలో ఇబ్బందులు కనిపించడం లేదు. ఇలాంటి సందర్భాల్లో మొత్తం రోగుల ఆరోగ్య చరిత్ర అడిగి తెలుసుకొని ఒక నిర్ణయానికి వస్తున్నారు. 5శాతం మందిలో మాత్రం న్యుమోనియాకు దారి తీస్తోందని వైద్యులు తెలిపారు.

కొవిడ్ తర్వాత ఈ తరహా కేసులు అధికం

–డాక్టర్ రమణప్రసాద్, సీనియర్ పల్మనాలజిస్టు, కిమ్స్ ఆసుపత్రి

కరోనా తర్వాత మళ్లీ ఇన్‌ఫ్లూయెంజా ఎ, బితోపాటు స్వైన్‌ఫ్లూ వైరస్‌లు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే అలర్జీ, బ్రాంకైటీస్, అస్తమాలాంటి వ్యాధులతో బాధపడుతున్నవారు మరింత వేగంగా వీటి బారిన పడుతున్నారు.

హఠాత్తుగా జ్వరం రావడం, పొడిదగ్గు, తలనొప్పి, కండరాల, కీళ్లనొప్పి,



తీవ్రమైన నీరసం, అలసట, గొంతు మంట, ముక్కు కారడడం సాధారణ లక్షణాలు. దగ్గు రెండువారాలు అంతకంటే ఎక్కువ రోజులే కొనసాగుతుంది. చికిత్స లేకుండానే చాలామంది మంది కోలుకుంటారు. గుంపుల్లోకి వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం, తరచూ చేతి శుభ్రత పాటించడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ వైరస్ సోకినవారికి మిగతా కుటుంబ సభ్యులు దూరం పాటించాలి. గర్భిణులు, శిశువులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, హెచ్ఐవీ, కీమో, స్టెరాయిడ్లు తీసుకుంటున్న వారు అప్రమత్తంగా ఉండాలి.

# ప్రయాణికుల ఇక్కట్లు తీరేదెన్నడు!

రామగుండం: పరిశ్రమలు నెలకొల్పితే పట్టణాలు, పల్లెల్లో సౌకర్యాలు మెరుగుపడి మరింత అభివృద్ధి జరుగుతుందనుకుంటే అందుకు విరుద్ధంగా మారింది రామగుండం పట్టణ పరిస్థితి. ఎన్టీపీసీ విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుతో సౌకర్యాల ఏర్పాటు కాదుకదా ఊరు పుట్టినప్పటి నుంచి ఉన్న బస్సు ప్రయాణ మార్గం కనుమరుగైంది. బసంత్‌నగర్ బుగ్గ గుట్ట నుంచి బీ–కార్నర్ వరకు దగ్గరి మార్గంగా ప్రత్యేక రహదారిని ఎన్టీపీసీ సంస్థ నిర్మాణం చేసుకుంది. కాలక్రమేణా ఈ రోడ్డుపై అందరూ రాకపోకలు చేపట్టడం, ర.భ.శాఖకు అప్పగించడంతో రాజీవ్ రహదారిలో కలిసిపోయింది. దీంతో అప్పటివరకు రామగుండం పట్టణం, రైల్వేస్టేషన్ మీదుగా గోదావరిఖని నుంచి పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్ వరకు నడిచే ఆర్టీసీ బస్సుల రాకపోకలు రద్దు అయ్యాయి. రామగుండం మీదుగా బస్సులు నడపాలని ప్రజలు కోరినా ఆందోళనలు చేపట్టినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. పైగా కుందనపల్లి రైల్వేగేట్లు కారణంగా తాము పట్టణం మీదుగా బస్సులు నడపలేమని చెప్పారు. దీంతో గత 25 ఏళ్లుగా రామగుండం పట్టణంలోని ఉమ్మడి మండల ఆర్టీసీ ప్రాంగణం నిరుపయోగంగా మారింది.

2 నుంచి 20 కిలోమీటర్ల దూరం

ఆర్టీసీ బస్సుల్లో పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్లాలన్నా అక్కడినుంచి తిరిగి ఇంటికి రావాలన్నా రామగుండం శివారులోని



బి–కార్నర్ మూలమలుపు బస్టాప్ వరకు రామగుండం పట్టణ ప్రజలు 2 కిలోమీటర్లు, అంతర్గాం మండలంలోని గ్రామాల ప్రజలు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం రావాల్సిందే. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో బి–కార్నర్ వద్దకు చేరుకొని బస్సులు ఎక్కుతున్నారు. అక్కడ బస్సు దిగిన వారు తిరిగి అదేవిధంగా ఇంటికి చేరుకుంటున్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ఆటోలు దొరకవు. ఈ పరిస్థితుల్లో లగేజీ మోస్తూ చీకట్లో భయం భయంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కుటుంబసభ్యులతో కాలినడకన ఇళ్లకు వస్తున్నామని బస్సు దిగిన ప్రయాణికులు అంటున్నారు. బి–కార్నర్ బస్టాప్ పాయింట్గా బస్సు ఛార్జీలు వసూలు చేయాల్సి ఉండగా గోదావరిఖని బస్టాండ్ వరకు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

నిరుపయోగం.. అన్యాక్రాంతం

ప్రజలకు బస్సు సేవలు అందించేందుకు బస్టాండు భవనం నిర్మాణానికి అప్పటి ఎ.పి.ఎస్.ఈ.బి.(ప్రస్తుతం జెన్‌కో) నుంచి ఆర్టీసీ వారు 3 ఎకరాల భూమిని అద్దె ప్రాతిపదికన లీజుకు తీసుకున్నారు. బస్టాండు భవనం నిర్మించి దాని మీదుగా కొన్ని రోజులు పల్లె బస్సులు నడిపారు. తర్వాత ప్రాంగణం మీదుగా బస్సుల రాకపోకలు నిలిపివేశారు. గత 25 ఏళ్లుగా ప్రాంగణ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. దీని మీదుగా బస్సులు నడపడంలేదు. ఇప్పటికే ప్రాంగణంలోని కొంత స్థలం అక్రమణకు గురైందన్న ఆరోపణలున్నాయి.

పైవంతెనలు నిర్మిస్తేనే బస్సుల రాకపోకలు

నాగభూషణం, డీఎం, గోదావరిఖని

రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట బస్సులు నిలిపేందుకు, మలుపుకొనేందుకు స్థలం లేదు. అందుకే స్టేషన్ మీదుగా ఎక్కువ బస్సులు నడపలేకపోతున్నాం.కుందనపల్లి, పెద్దంపేట రైల్వేగేట్లు, రైల్వే పైవంతెన 'వై' ఆకారంలో నిర్మించకపోవడం వల్ల రామగుండం పట్టణం మీదుగా బస్సులు నడిపించలేని పరిస్థితి నెలకొంది. అంతర్గాం–మంచిర్యాల మధ్య గోదావరినదిపై పైవంతెన, కుందనపల్లి రైల్వేగేట్ల వద్ద పైవంతెనల నిర్మాణాలు పూర్తయితే గోదావరిఖని నుంచి రామగుండం మీదుగా కరీంనగర్, హైదరాబాద్, మంచిర్యాలకు బస్సులు నడిపిస్తాం.

# జిన్నారంపై శీతకన్ను

జిన్నారం: ఓటు బ్యాంకు అధికంగా ఉండే పారిశ్రామిక వాడలున్నా, ఆర్థికంగా బలమైన నాయకులు ఉన్నా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల నేతలకు సుమారు నాలుగు దశాబ్దాల నుంచి శాసనసభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు టికెట్ ఇవ్వలేదు. జిన్నారం మండలం 1985లో ఏర్పడింది. 1989లో మాత్రం జిన్నారం మండలం ఖాజీపల్లికి చెందిన డి.రామకృష్ణ తెలుగుదేశం పార్టీ నుంచి మెదక్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అదే సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిన్నారం మండల పరిషత్ అధ్యక్షుడు పడకంటి వెంకటేశంగుప్తా స్వతంత్ర అభ్యర్థిగా నర్సాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి 22 వేల ఓట్లు తెచ్చుకున్నారు. అప్పట్లో నర్సాపూర్ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ మిత్రపక్షమైన సీపీఐకి ఇవ్వటంతో వెంకటేశంగుప్తా రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. తరువాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఉమ్మడి జిన్నారం మండలానికి చెందిన




నాయకులు టికెట్ కోసం పైరవీలు చేయటమే కాని ప్రధాన పార్టీలు ఏవీ కేటాయించలేదు. పారిశ్రామికంగా ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ మండలానికి రాజకీయంగా అంతంత మాత్రమే గుర్తింపు లభించింది. 2026లో అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన జరిగితే జిన్నారం నియోజక వర్గ కేంద్రం అవుతుందనే అంచనాల్లో నేతలు ఉన్నారు. ఇప్పటికే పటాన్‌చెరు నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 3.81 లక్షలు దాటగా, 2026 వరకు అది 4.5 లక్షలు అవుతుందనే అంచనాలు ఉన్నాయి. ఇదే జరిగితే కొత్త నియోజక వర్గంగా జిన్నారం ఏర్పాటు కావటం ఖాయమని భావిస్తున్నారు. అవకాశాలు వస్తాయని ఎదురుచూస్తున్నారు.

# సత్య మార్గం.. ఉపాధికి ఊతం

ఖమ్మం : నలుగురికీ ఉపయోగకరంగా నిలవాలనే ఉద్దేశంతో ఖమ్మంలో ఓ మహిళ పాతికేళ్ల కిందట నెలకొల్పిన 'సత్యమార్గం సర్వీసెస్ సొసైటీ' నేడు వేలాది మందికి అండగా నిలబడింది. వివిధ అంశాల్లో ఉచితంగా శిక్షణ అందిస్తూ వారి ఉపాధికి బాటలు వేస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో జన్మించిన సరిదే శ్రీలక్ష్మి ఖమ్మానికి చెందిన నగేశ్‌ను వివాహం చేసుకుని నిజాంపేటలో స్థిరపడ్డారు. 2001లో సేవా రంగంలోకి ప్రవేశించిన ఆమె 2007లో 'సత్యమార్గం సర్వీసెస్ సొసైటీ'ని ప్రారంభించారు. నాటి నుంచి వేలాది మందికి పలు వృత్తుల్లో ఉచిత శిక్షణ అందించారు. శిక్షణ పొందిన మహిళలు ప్రస్తుతం ఆయా రంగాల్లో స్థిరపడి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. కుట్టు శిక్షణ, బ్యూటీషియన్, మెహిందీ, బ్రైడల్ శారీ ప్రీ ఫోల్డింగ్, అగర్‌బత్తీల తయారీ, దుస్తులు ఉతికే, గిన్నెలు కడిగే, ఇల్లు తుడిచే రసాయనాల తయారీ, కాగితం సంచుల తయారీలో శిక్షణ అందిస్తున్నారు.

ఖమ్మం జిల్లా జైలులో మహిళా ఖైదీలకు 45 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా జైలులో ఖైదీలకు 3 రోజులపాటు కాగితం సంచుల తయారీలో శిక్షణ అందించారు. అత్యాచారానికి గురై ధగా పడిన యువతులు, మహిళలకు భరోసా కేంద్రాల్లో కుట్టు శిక్షణ, కాగితం సంచుల తయారీలో శిక్షణ అందించారు. సంస్థ పనితీరును గుర్తించి సీపీ విష్ణువారియర్ ఈ అవకాశం కల్పించారు. నిరుద్యోగ యవకులకు లాజిస్టిక్స్‌లో శిక్షణ ఇవ్వగా వారిలో చాలా మందికి విజయవాడ, ఖమ్మం, వరంగల్ ఎఫ్‌సీఐ గోదాముల్లో హమాలీలుగా ఉపాధి అవకాశం దక్కింది. ఖమ్మం, చింతకాని, ఖమ్మం



గ్రామీణం, బోనకల్లు, రఘునాథపాలెం మండలాల్లో కుట్టు శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఎక్కువ మంది నేర్చుకునే చోటే కేంద్రం ఏర్పాటు చేస్తారు. అవార్డులు, రివార్డులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్యమార్గం నిర్వాహకురాలు శ్రీలక్ష్మిని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సత్కరించారు.కోల్‌కతాలోని స్వామి వివేకానంద, సిస్టర్ మార్గరేట్ '2019-20' అవార్డును సిస్టర్ మార్గరేట్ ఫౌండేషన్ ప్రకటించింది. 2020 ఫిబ్రవరి 20న పశ్చిమ బంగా గవర్నర్(ప్రస్తుత ఉప రాష్ట్రపతి) జగ్‌దీప్ ధన్‌కర్ నుంచి శ్రీలక్ష్మీ అవార్డు అందుకున్నారు. అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ శ్రీలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేయగా, బెంగళూరులో 2020 జూన్ 20న అందుకున్నారు.హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఉమెన్ ఎంపవర్‌మెంట్-2019 అవార్డుకు ఎంపిక చేసి బహూకరించారు. %http://www.sathya margam.com% వెబ్‌సైట్‌లో తమ సంస్థ సేవా కార్యక్రమాలు పూర్తిగా తెలుసుకోవచ్చని, తమని సంప్రదించవచ్చని వివరించారు.

సొంత సొమ్ముతో...పలు వృత్తుల్లో శిక్షణ అందించే శిక్షకులకు సొంత డబ్బు జీతంగా ఇస్తున్నారు. తన ముగ్గురు కుమార్తెలు, అల్లుళ్ల ప్రతినెలా అందించే ఆర్థిక సాయంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఇక్కడ సేవలందించేందుకు 300 మంది కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు సహా వేర్వేరు రంగాల్లోని వారు సంస్థకు సమయం కేటాయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కౌశల్ యోజన, స్కిల్ డెవలప్‌మెంట్, రాజీవ్ యువ కిరణాలు, మెప్మా, డీఆర్డీఏ పథకాలను ఆసరా చేసుకుని నిరుద్యోగులకు పలు రంగాల్లో శిక్షణ అందించి ఉపాధి మార్గం చూపుతున్నారు.కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో వందల మందికి ఉచితంగా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. వినాయక చవితికి మట్టి, విత్తన గణపతులు తయారు చేయించి పంచుతున్నారు. ఖమ్మంలోని కేవీఎం పాఠశాలలో 9 ఏళ్లుగా ఉచితంగా నోట్ పుస్తకాలు అందిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు ముందు 3 నెలలు అల్పాహారం, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నారు.

## జీవన కళ.. సృజన భళా

పాల్వంచ : కళలు బాలల నేస్తాలు. ఆసక్తి ఉన్నకళల్లో రాణించే వారి ఆలోచనా దృక్పథం భిన్నంగా ఉంటుంది. సృజనాత్మక ఆలోచనలు మెరుగైన జీవనశైలికి దోహదపడేలా చేస్తాయి. కళల్లో సిద్ధహస్తులైన వారికి ప్రపంచాన్ని సామాజిక కోణంలో చూడగలిగే భిన్న పార్శ్వం, నైపుణ్యాలు అలవడుతాయంటారు. ఈ క్రమంలో కేవలం చదువుకే పరిమితమైన నేటి విద్యార్థులను కళల దిశగా ప్రోత్సహించేందుకు 'సాంఘిక', 'గిరిజన సంక్షేమ', ఏకవల్య గురుకులాల నిర్వాహకులు ప్రత్యేక కృషిచేస్తున్నారు. పాల్వంచ పట్టణం బొల్లోరిగూడెంలోని బాలుర సాంఘిక సంక్షేమ గురుకులం వేదికగా 'స్పార్కిల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 22న ప్రారంభించిన వేసవి శిక్షణ శనివారంతో ముగియనుంది. జిల్లాలోని 9 విద్యాలయాలకు చెందిన 6 - 10వ తరగతుల బాలురు 200 మంది హాజరయ్యారు. ఏడుగురు కళాకారులు, నిపుణులు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు శిక్షణ ఇచ్చారు. ఏర్పాట్లను విద్యాలయ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ఏం నేర్చుకున్నారంటే... థియేటర్ ఆర్ట్స్: ఇద్దరు ట్రైనర్లు ప్రతిరోజు నైపుణ్యాలు నేర్పించారు. రంగస్థల నటన, స్క్రిప్ట్ రైటింగ్, ఎడిటింగ్, అనువాదం, అడాప్టింగ్, సెట్ డిజైనింగ్, లైటింగ్, ఇన్‌స్ట్రుమెంట్స్ ప్లేయింగ్, కాస్ట్యూమ్స్ డిజైనింగ్, సౌండ్ ఎఫెక్ట్స్, మేకప్, ప్రొడక్షన్, దర్శకత్వం గురించి వివరించారు. ఏకపాత్రాభినయం, నవరసాలు పలికించడంపై తర్ఫీదు ఇచ్చారు. చిత్రలేఖనం: భావాలను దృశ్యరూపకంగా చాటే కళ ఇది. ఏదైనా విషయంపై సృజనాత్మక శక్తితో అద్భుత చిత్రాలు ఎలా తీర్చిదిద్దాలో వివరించారు.

యాంకరింగ్, పబ్లిక్ స్పీకింగ్: తమ భావాలను వాక్చాతుర్యంతో, ప్రస్ఫుటంగా, ధైర్యంగా నలుగురిలో చెప్పగలిగేలా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. నాయకత్వ లక్షణాలు ఎలా పుణికిపుచ్చుకోవాలో నిపుణులు వివరించారు.

సంస్కృతం: ఇది.. వేదభాష. ఇతిహాసాలు, పురాణాలన్నీ రచించింది సంస్కృతంలోనే. తరతరాల సంస్కృతికి వారధి. ఈ భాషపై పట్టు సాధించే వారికి దేశ సంస్కృతిపై ఎలా విస్తృత అవగాహన పెంపొందుతుందో తెలిపారు. అక్షరమాల, వ్యాఖ్య రచనపై పట్టుసాధించేలా శిక్షణ ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు వేసవి శిక్షణలకే పరిమితం కారాదన్నది తల్లిదండ్రుల ఆకాంక్ష. పాఠశాలల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధతో నైపుణ్యాలు అలవర్చాలని కోరుతున్నారు.

సృజనాత్మకత చాటేందుకు చక్కని వేదిక

విద్యార్థులకు చదువొక్కటే ప్రపంచం కాదు. వారు రాణించడానికి థియేటర్ ఆర్ట్స్ చక్కని వేదికగా నిలుస్తాయి. మేధస్సుకు పదును పెడితే ఏజెన్సీ విద్యార్థులు అద్భుతాలు సృష్టించగలరు. స్టేజీ భయం లేకుండా, నవరసాలు పలికించేలా, ఏకపాత్రాభినయంలో రాణించేలా చిన్నారులను తీర్చిదిద్దాం. ఇలాంటి శిక్షణలు బాలలకు ఎంతోమేలు చేస్తాయి.ఆకుల రోహిత్‌రాజ్, థియేటర్ ఆర్ట్స్ ట్రైనర్చిన్నప్పట్నుంచి చిత్రలేఖనం అంటే ఇష్టం. మొన్నటి వరకు శిక్షణ తీసుకోలేకపో యా. తాజా శిబిరంలో గురువులు మెలకువలు నేర్పించారు. శ్రద్ధాసక్తులతో నైపుణ్యాలు ఒంటబట్టించుకున్నా. గతం కంటే ఎంతో మిన్నగా చిత్రాలు వేయగలుగుతున్నా. నిరంతర సాధన కొనసాగిస్తా.బందెల శ్వేతన్, మణుగూరు విద్యార్థి

# మాయా మశ్చీంద్ర



వైరా : రాష్ట్ర స్థాయిలో కొరమీను చేప పిల్లలను ఉత్పత్తి చేయాల్సిన ఏకైక మత్స్య విత్తన కేంద్రం వైరా. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల స్థాయిలో తెల్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసే కేంద్రమూ ఇదే. మత్స్య శాఖకు గుండెకాయ లాంటి డివిజన్. అపార జలపుష్ప సంపద.. వేల సంఖ్యలో మత్స్యకారులున్న కేంద్రంలో ఆ సంపద చేతికొచ్చే తరుణం ఇది.. చేపపిల్లల ఉత్పత్తికీ ఏర్పాట్లు చేసుకోవాల్సిన సమయమూ ఇదే. కీలక సమయంలో చూద్దామన్న సిబ్బంది కనిపించటం లేదు.. పర్యవేక్షణ లేమితో నష్టం వాటిల్లేలా ఉన్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం విశేషం.

కొరమీను ఉత్పత్తి ఎలా?రాష్ట్రంలో కొరమీను చేపపిల్లల ఉత్పత్తికి వైరాను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. కరోనా ముందు నుంచి ఈ ప్రక్రియ నడుస్తుండగా గత సీజన్‌లో మాత్రమే వీటి ఉత్పత్తి విజయవంతమైనట్లు అధికారులు ప్రకటించారు. అతి కష్టంగా గత సీజన్‌లో 50వేల పిల్లలు ఉత్పత్తి చేయగా అందులో 1500 పిల్లలు మాత్రమే 5 అంగుళాల పరిమాణం వరకు ఎదిగినట్లు మత్స్య శాఖ నివేదిక ప్రకటించింది. ఈసారి ఇంకా ఎక్కువ ఉత్పత్తి చేయాలని నిర్ణయించగా ఆ పరిస్థితి లేదు. వర్షాకాలం ఆరంభం జూన్ నాటికే ప్రక్రియ గాడినపడాలి. గత సీజన్‌లో సిఫా శాస్త్రవేత్తల పర్యవేక్షణలో భాగంగా శిక్షణ పొందిన ఎఫ్‌డీవో, ఫిషరీస్ అసిస్టెంట్‌లు ఇద్దరిపైనా వేటుపడింది. దీంతో ఉత్పత్తి పూర్తి ప్రశ్నార్థకంగా మారింది.

ఇదీ పరిస్థితి

కొద్ది నెలలుగా జిల్లా మత్స్య శాఖ పరిస్థితి పూర్తిగా మసకబారింది. గత డిసెంబరులో వైరా కార్యాలయం వేదికగా అవినీతి అంశాలపై ఏసీబీ సోదాలు చేసింది. దాడుల నేపథ్యంలో ఎఫ్‌డీవో బుజ్జిబాబును సస్పెండ్ చేయగా ఫిషరీస్ అసిస్టెంటు మురళీని విధుల నుంచి పూర్తిగా తొలగించారు. అనంతరం ఎఫ్‌డీవో పోస్టులో మరొకరిని నియమించలేదు. ఖమ్మం జిల్లా అధికారి(ఏడీ)కి ఇన్‌ఛార్జి బాధ్యతలప్పగించారు. ఇక్కడ నాలుగైదు నెలల నుంచి కార్యకలాపాలన్నీ కుంటుపడ్డాయి. సీజన్ సమీపిస్తున్నా చక్కదిద్దే పరిణామాలు కనిపించటం లేదు.

కోటి ఉత్పత్తి లక్ష్యం

వైరా మత్స్య విత్తన క్షేత్రంలో ఏటా కట్ల, రోహు, మృగాల, బంగారుతీగ చేప పిల్లలను ఉత్పత్తి చేయాలి. జూన్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కావాలి. అన్ని రకాలు కలిపి మొత్తం కోటి పిల్లల (చిచ్చురు... గుడ్డు నుంచి బయటకు వచ్చే దశ) ఉత్పత్తి లక్ష్యం ఇప్పటికే విధించారు. వీటిని రేరింగ్ ద్వారా 30 లక్షల పిల్లలను (30 అంగుళాల పరిమాణంలో) మత్స్య సంఘాలకు అందించాలని నిర్ణయించారు. లక్ష్యంలో భాగంగా పది లక్షల చిచ్చురు చేపపిల్లలను పాల్వంచ కిన్నెరసానిలో పెంపకం కేంద్రానికి అప్పగించాలనే నిబంధన ఉంది. అక్కడ సైతం వీటిని రేరింగ్ చేపట్టాలి. మరో 13 లక్షల బంగారుతీగ చిరు చేపలను ఉత్పత్తి చేసే బాధ్యతా వైరా డివిజన్‌దే. దీనికోసం స్థానిక మత్స్య కేంద్రంలో సిమెంటు, మట్టి కొలనులున్నాయి. వీటి నిర్వహణ ఇప్పటికే ప్రారంభించాలి. పైపులైన్లు, హేచరీస్, ఇతర విభాగాలు సిద్ధం చేయాలి. కానీ అవేమీ ప్రస్తుతం కనిపించటం లేదు.

అధికారులకు నివేదించాం..

ఆంజనేయస్వామి, మత్స్య శాఖ ఏడీ...వైరా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో పనిభారం ఉంది. కొరమీను ఉత్పత్తికి ప్రయోగాత్మక కేంద్రమిది. సాధారణ చేపపిల్లలు కోటి వరకు ఉత్పత్తి చేయాలి. వీటి పర్యవేక్షణకు ఖాళీలను భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరాం. ప్రస్తుతానికి ఇక్కడ ఫిషరీస్ ఫీల్డ్ ఆఫీసర్‌ను తాత్కాలికంగా నియమించాం. సాధ్యమైన మేరకు ఉత్పత్తిని సజావుగా చేసే ప్రయత్నాలు చేస్తున్నాం.

# ఆరోగ్య మిత్రులేరి..



ఖమ్మం : 2008లో ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభ సమయంలో పొరుగు సేవల విభాగంలో ఆరోగ్య మిత్రలను నియమించారు. అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందించేలా విధులను నిర్దేశించారు. పీహెచ్‌సీల పరిధిలో ఉండే ఆరోగ్య మిత్రలు రోగుల సమస్యలు తెలుసుకునేవారు. వైద్యాధికారుల వద్దకు తీసుకెళ్లి వైద్యం అందే వరకు వెన్నంటి ఉండేవారు. చికిత్స పూర్తయిన తర్వాత సహకారం అందించేవారు. కొన్నేళ్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మిత్ర సేవలు అందుబాటులో లేవు. ప్రస్తుతం ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులకే వారు పరిమితమయ్యారు. వాటిల్లోనూ ప్రస్తుత అవసరాలకు, వీరి సంఖ్యకు పొంతన లేదు. దీంతో పనిభారం అధికమై మిత్రలు, సకాలంలో సేవలందక రోగులు ఇబ్బంది పడుతున్నారు.

సమస్య ఏంటి?ప్రాథమిక స్థాయిలో ఆరోగ్య మిత్రలు లేకపోవటంతో సామాన్య ప్రజలకు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలపై మార్గనిర్దేశం సరిగ్గా అందటం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతోన్న ఆయుష్మాన్ సేవల కోసం పీహెచ్‌సీలకు వెళ్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకోపక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంలో 2 లక్షల తెల్ల రేషను కార్డులుండేవి. ఇప్పుడు ఒక్క ఖమ్మం జిల్లాలోనే 3లక్షల తెల్ల కార్డులు, భద్రాద్రి జిల్లాలో మరో 3లక్షలున్నాయి. వీరందరికి ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలందించడానికి ప్రస్తుతం ఉన్న 70మంది ఏ మాత్రం చాలటం లేదు. అదనంగా మరో 100 మంది అవసరమవుతారంటే అతిశయోక్తి కాదు.

మచ్చుకు కొన్ని... ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన స్థాయిలో ఆరోగ్య మిత్రలు లేకపోవడంతో రోగులకు ఆయుష్మాన్, ఆరోగ్యశ్రీ సేవలు ఆశించిన స్థాయిలో లభించడం లేదు.సత్తుపల్లి సీహెచ్‌సీలో ఐదుగురు ఉండాలి. ముగ్గురే ఉన్నారు. ఇక్కడ డయాలసిస్ కేంద్రం కూడా పనిచేస్తుంది. మధిర సీహెచ్‌సీలో ముగ్గురు ఆరోగ్య మిత్రలు పనిచేయాలి. ఒక్కరు మాత్రమే సేవలందిస్తున్నారు.నేలకొండపల్లి సీహెచ్‌సీలో ముగ్గురికి ఒక్కరు, తిరుమలాయపాలెం సీహెచ్‌సీలో కూడా ఒక్కరే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కల్లూరు సీహెచ్‌సీలో ఇద్దరి పని ఒక్కరే చేస్తున్నారు.

పెనుబల్లి సీహెచ్‌సీలో ముగ్గురు ఉన్నారు. త్వరలో డయాలసిస్ కేంద్రం రానుంది. సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది.

చాలీచాలని వేతనాలతో..

ఆరోగ్యశ్రీ కొత్తలో రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మంది ఆరోగ్య మిత్రలు ఉండేవారు. వారిలో ఎక్కువ శాతం పోస్టు గ్రాడ్యుయేట్ చదువుకున్నవారే. అందులో చాలామంది వేతనం చాలక వేరే ఉద్యోగాలకు తరలివెళ్లారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 900 మంది మాత్రమే ఉన్నారు. వీరికి రూ.15వేలు వేతనం చెల్లిస్తున్నారు. వాటిల్లో రూ.13వేలు చేతికందుతున్నాయి. చాలీచాలని వేతనాలకు తోడు ప్రభుత్వం నిర్దేశించే లక్ష్యాలతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. ప్రతి ఆరోగ్య మిత్ర ప్రతి నెలా వంద కేసులను ఆరోగ్యశ్రీ కింద నమోదు చేయాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో 70 మంది..ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంలో 126 మంది ఆరోగ్య మిత్రలు ఉండేవారు. ప్రస్తుతం 70 మంది పనిచేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 14, ఖమ్మం జిల్లాలో 18 వెరసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 32 నెట్‌వర్క్ ఆసుపత్రులున్నాయి. వాటిల్లో మాత్రమే ప్రస్తుతం వీరు పనిచేస్తున్నారు. పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో లేరు. ఒకప్పుడు రోగికి, నెట్‌వర్క్ ఆసుపత్రులకు మధ్య ఆరోగ్య మిత్రలు అనుసంధానంగా ఉండేవారు. ఇప్పుడు ప్రభుత్వానికి, నెట్‌వర్క్ ఆసుపత్రులకు అనుసంధానంగా పని చేస్తున్నారు. "ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి రోగులను నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపే ప్రక్రియలో ఆరోగ్య మిత్రల అవసరం ఎంతో ఉంది. చాలామంది ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ సేవల కోసం నెట్‌వర్క్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను సందర్శిస్తున్నారు. అక్కడి మిత్రలు సేవలందిస్తున్నారు. వారి సంఖ్య పెంపుపై ప్రభుత్వానికి నివేదించాం."పి.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

## 555 శిథిల క్వార్టర్ల కూల్చివేతకు నిర్ణయం

కొత్తగూడెం : సింగరేణిలో పనిచేసే ఉద్యోగులకు అన్ని సదుపాయాలతో కూడిన క్వార్టర్లు కేటాయించేందుకు యాజమాన్యం చర్యలు చేపడుతుంది. కొత్తగూడెం ఏరియాలో ఏడెనిమిది దశాబ్దాల క్రితం పలు క్వార్టర్లు నిర్మించగా.. అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. కొన్ని నివాసాల్లో మొన్నటిదాకా కార్మిక కుటుంబాలు నివసించాయి. మరికొన్ని సరైన మరమ్మతులకు నోచుకోలేదు. నిర్లక్ష్యానికి గురైన నివాసాల్లో కలప, ఇనుము వంటి సామగ్రిని చోరులు ఎత్తుకెళ్లడం షరామామూలైంది. రెండంతస్తులతో నిర్మించిన 'టీ2' రకం క్వార్టర్ల కాలం కూడా చెల్లుతోంది. చాలావరకు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో ప్రమాదకరంగా ఉన్నవాటిని గుర్తించి వెంటనే తొలగించేందుకు అధికారులు నిర్ణయించారు. స్థానిక ఏరియాలోని రుద్రంపూర్, ధన్‌బాద్, త్రీఇంక్లైన్, రామవరం, గౌతంపూర్ ప్రాంతాల్లో మొత్తంగా 555 క్వార్టర్లు నివాసయోగ్యంగా లేవని గుర్తించారు. యాజమాన్యం అనుమతితో ఏరియా అధికారులు పలు దఫాలుగా కూల్చివేత పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు 107 నేలమట్టం చేశారు. మరో 18 క్వార్టర్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. మరో రెండు మూడ్రోజుల్లో ఈ పనులు పూర్తవనున్నాయి. ఆక్రమణలపైనా దృష్టిశిథిలమైన వాటిలో మరో 430 క్వార్టర్లు తొలగించేందుకు యాజమాన్యం తాజా జాబితా సిద్ధం చేసింది. వీటిల్లో టీ 2 రకానికి చెందిన వాటితో పాటు ఎంబీ, ఎంసీ రకం నివాసాలున్నాయి. తొలుత రామవరం, ధన్‌బాద్, త్రీఇంక్లైన్ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నారు. చాలా వరకు నివాసయోగ్యంగా లేకపోగా, కొన్నింటిలో కార్మికేతరులు తలదాచుకుంటున్నారు. తొలగించాలని నిర్ణయించిన నివాసాలను రెండేళ్లుగా కార్మికులకు కేటాయించకుండా మినహాయించారు. అప్పటి నుంచి అవి ఖాళీగా ఉండటంతో ఇతరులు నివాసముంటున్నారు. త్వరలో ఉన్నతస్థాయి అధికారుల సమావేశం అనంతరం.. ఆక్రమణలకు గురైన క్వార్టర్లనూ తొలగించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌ల సరఫరా

ములుగు : విద్యాశాఖలో పరిస్థితులు మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికతను ప్రవేశపెడుతోంది. ఇప్పటికే ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు నమోదుకు బయోమెట్రిక్ యంత్రాలను ప్రవేశపెట్టగా.. పాఠశాలలోని ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కొత్తగా ట్యాబ్‌లను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాలకు ప్రముఖ కంపనీకి చెందిన ట్యాబ్‌లను ప్రభుత్వం సరఫరా చేసింది. ఒక్కో ట్యాబ్ ఖరీదు సుమారు రూ. 20 వేల వరకు ఉంటుందనేది అంచనా. జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు వీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. పది మందికి పైగా విద్యార్థులున్న పాఠశాలను ఎంపిక చేసి సరఫరా చేశారు. విద్యాశాఖ లెక్కల ప్రకారం ములుగు జిల్లాలో మొత్తం 264 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ఈ సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మొత్తం 266 ట్యాబ్‌లను సరఫరా చేసింది. ప్రస్తుతం ఇవి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు వీటిని పాఠశాలలకు అందించాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నారు. ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించి పరీక్షించిన తర్వాత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించనున్నారు.



అంతర్జాలంలో వివరాల నమోదు

ట్యాబ్‌లలో పాఠశాలలకు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయనున్నారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన వివరాలు, పిల్లల సంఖ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మార్కుల వివరాలు, నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిమెట్టు, కొత్త విద్యార్థుల ప్రవేశాలు లాంటి కార్యక్రమాల వివరాలు పొందుపర్చనున్నారు. దాంతో పాటు ఆన్‌లైన్ తరగతులకు కూడా ఉపయోగపడనున్నాయి. గతంలో యూడైస్ లాంటి వివరాలు పాఠశాల నుంచి లిఖితపూర్వకంగా సమర్పించిన తర్వాతనే తుది జాబితా సిద్ధం చేసేవారు. దీని ద్వారా పాఠశాలకు సంబంధించి ప్రతి అంశం నేరుగా ఆన్‌లైన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేరనుంది.పాఠశాల ప్రారంభానికి ముందే అందిస్తాం..రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. పాఠశాలల ప్రారంభానికి ముందే వాటిని సరఫరా చేస్తాం. ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించనున్నాం.జి.పాణిని, జిల్లా విద్యాశాఖ అధికారి

## ధర ఒక్కటే.. చెల్లింపుల్లోనే తేడా!

ములుగు : విత్తు నాటింది మొదలు.. పంట అమ్మే వరకు రైతులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకొస్తే అక్కడా దగా పడుతున్నారు.. కోత.. కమీషన్ల పేరిట విక్రయసొమ్ము చెల్లించే సమయంలో వ్యాపారులు చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట ఉండడంలేదు. ప్రస్తుతం రైతులు పత్తి, మిర్చి, వరి, మొక్క జొన్న పంటలను విక్రయించేందుకు మార్కెట్లకు వస్తున్నారు. ఈ-నామ్ రాకతో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనుకున్న అన్నదాతకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కేసముద్రం, మహబూబాబాద్, జనగామ, నర్సంపేట, పరకాల, వరంగల్ మార్కెట్లలో ఈ- నామ్ విధానం అమలవుతోంది. ఆరేళ్లు దాటినా ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల హవానే నడుస్తోంది. ఈనామ్ పూర్తిస్థాయిలో అమలైతే కూలీ ఛార్జీలు తప్పితే ఒక్కపైసా ఎవరికీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ-నామ్ అమలు చేస్తున్నామని చెబుతున్న మార్కెట్లలో కేవలం టెండర్లకు మాత్రమే పరిమితం కావడంతో దోపిడీ ఎప్పటిలాగే కొనసాగుతోంది..కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఇచ్చిన లాట్ ఐడీ చూపుతున్న ఈ రైతు కేసముద్రం మండలం క్యాంపుతండాకు చెందిన ధరంసోతు రాంచంద్రు. ఏప్రిల్ 27న కేసముద్రం మార్కెట్‌కు 40 బస్తాల మిర్చి తీసుకెళ్లారు. క్వింటాలుకు రూ.18,669 ధర పలికింది. గిట్టుబాటు కాకపోవడంతో అక్కడి నుంచి 28న మహబూబాబాద్ మార్కెట్‌కు తీసుకెళ్లగా అక్కడ క్వింటాలుకు రూ.19, 800 ధర ఉంది. కేసముద్రం నుంచి మహబూబాబాద్ మార్కెట్‌కు మిర్చి బస్తాలు తరలించడానికి రవాణా ఖర్చులు రూ.1500 వెచ్చించారు. కేసముద్రం మార్కెట్‌లో రెండు రోజులు పడిగాపులు పడాల్సి వచ్చింది. కేసముద్రం మార్కెట్‌లో కమీషన్ పేరిట రూ.100కు రూ.3 కోత పెడుతున్నారు. మహబూబాబాద్ మార్కెట్‌లో ఇది రూ.2 గా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

నగదు పేరిట..రాష్ట్రంలో 192 వ్యవసాయ మార్కెట్లు ఉండగా అందులో 57 మార్కెట్లలో ప్రస్తుతం ఈ-నామ్ అమలు చేస్తున్నారు. ఇందులో కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్లలో మాత్రం ప్రత్యక్ష విధానం అమల్లో ఉండటంతో కమీషన్ కోత ఉండదు. వరంగల్ వంటి ఇతర మార్కెట్లలో అడ్తీ విధానం ఉండటంతో నిబంధనల ప్రకారం 2 శాతం అడ్తీ కమీషన్ కోత పెట్టుకోవచ్చు. క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఒప్పందాలు చేసుకొని దోపిడీ కొనసాగిస్తున్నారు. వరంగల్ మార్కెట్‌లో నిబంధనల ప్రకారం నూటికి 2 శాతం కోత విధించాలి. నగదు చెల్లింపులు ఇతర కారణాలు చూపుతూ నూటికి 4 శాతం నుంచి 5 శాతం కోత విధిస్తున్నారు. కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్లలో మిర్చి అమ్మకాలకు స్థానికంగా ఒప్పందం చేసుకుని 3, 2 శాతం చొప్పున కమీషన్ వసూలు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాలిప్రస్తుతం మిర్చి పంటకు 2 శాతం, నగదు చెల్లింపు పేరుతో 1శాతం కోత విధిస్తున్నారు. పూర్తి స్థాయిలో ఈ-నామ్ అమలు చేసి ఎలాంటి కోత లేకుండా సరకు విక్రయించిన వెంటనే ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాలి.

రాంజీనాయక్, కోమటిపల్లి, కేసముద్రం

నిబంధనలకు విరుద్ధంగా కమీషన్ కటింగ్15 రోజుల కిందట వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో 22 క్వింటాళ్ల మిర్చి విక్రయించాను. క్వింటాలుకు రూ.32 వేలు పలికింది. నిబంధనల ప్రకారం అడ్తీ కమీషన్ 14,080 కోత విధించాల్సి ఉంది. రూ.28,160 తీసుకున్నారు. అదనంగా కమీషన్ కోతపై ప్రశ్నిస్తే అన్ని మార్కెట్లలో ఇలాగే ఉందని చెప్పారు.కాటిపల్లి వెంకట్రావు, మేడిపల్లి, జగిత్యాల జిల్లాపూర్తిస్థాయిలో అమలు చేస్తాంత్వరలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మార్కెట్‌లలో పూర్తి స్థాయిలో ఈ-నామ్ విధానం అమలు చేస్తాం. వరంగల్ మార్కెట్‌లో 2 శాతం మాత్రమే అడ్తీ కమీషన్ తీసుకోవాలి. కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్లలో ఎలాంటి కమీషన్ కోత విధించొద్దు.





# మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం

తాడేపల్లి : విజయవాడ బస్టాండ్‌లో జరిగిన బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఉదయం ముఖ్యమంత్రికి ప్రమాద ఘటనపై వివరాలను అధికారులు అందించారు. ఆర్టీబస్సు ప్రమాదవశాత్తూ ఫ్లాట్‌ఫాంమీదకు దూసుకుపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుందని వివరించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై విచారణ చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు వెంటనే పరిహారం అందించాలని, గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశాలు జారీచేశారు.

# జగన్ ప్రభుత్వ అండదండలతోనే దళితులపై దమనకాండ: లోకేశ్



అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పెద్దల ప్రోద్బలంతోనే దళితులపై వరుసగా దాడులు కొనసాగుతున్నాయని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. అరాచకశక్తులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ అలసత్వమే దీనికి నిదర్శనమని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పెద్దాపురంలో నిప్పుల కోటేశ్వరరావు కుటుంబంపై వైకాపాకి చెందిన ముత్తారెడ్డి దాడికి పాల్పడటం దారుణమన్నారు. ఈ మేరకు లోకేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. "కులం పేరుతో ముత్తారెడ్డి తనను దూషించాడని బాధితుడు కోటేశ్వరరావు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. దాడి తర్వాత బాధిత కుటుంబానికి వైద్యం అందించేందుకు నందిగామ ప్రభుత్వాసుపత్రి సిబ్బంది నిరాకరించడాన్ని గమనిస్తే జగన్ ప్రభుత్వ అండదండలతోనే దళితులపై దమనకాండ కొనసాగుతున్నట్లు స్పష్టమవుతోంది. కంచికచర్లలో దళిత యువకుడు కాండ్రు శ్యామ్ కుమార్‌పై మూత్రం పోసి అవమానించి చిత్రహింసలకు గురిచేశారు. ఈ ఘటనలో బాధ్యులపై బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడాన్ని చూస్తే దళితులపై జరుగుతున్నవన్నీ ప్రభుత్వ ప్రాయోజిత దాడులేనని స్పష్టమవుతోంది. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న అరాచకపర్వంపై కేంద్ర ప్రభుత్వం, జాతీయ మానవహక్కుల కమిషన్ జోక్యం చేసుకుని వారికి రక్షణ కల్పించాలి" అని లోకేశ్ కోరారు.

# జనహృదయపు నేత జగనన్న - ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్ల పండుగ

కాకినాడ: ముఖ్యమంత్రి వై. యస్. జగన్ మోహన్ రెడ్డి జనహృదయ నేతగా నిలిచారని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైయస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర నేటికి ఆరేళ్లు పూర్తి అయిన సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2017 లో ప్రారంభించి 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్లు నడిచి సుమారు రెండు కోట్ల మంది ప్రజలను కలుసుకుని 6 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈరోజు ఉదయం పెద్దాపురం వైఎస్సార్ విగ్రహం దగ్గర, సామర్లకోట వైయస్ఆర్ విగ్రహం దగ్గర, సామర్లకోట జగనన్న లే అవుట్ లో వైయస్ఆర్ విగ్రహానికి పూల దండలు గజ మాలలతో సత్కరించి కేక్ కటింగ్



కార్యక్రమాలలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్ ఛార్జ్ - పెద్దాపురం నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇన్‌చార్జ్ దవులూరి దొరబాబ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విజయవాడ బస్సు ప్రమాదంపై పురందేశ్వరి స్పందన

విజయవాడ: రాష్ట్రంలోనే అతిపెద్ద బస్టాండ్‌లో బస్సు ప్రమాదం ఆందోళనకు గురి చేసిందని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి అన్నారు. సోమవారం విజయవాడలో జరిగిన బస్సు ప్రమాదంపై మీడియాతో మాట్లాడుతూ.. ఈ బస్టాండ్‌కు నిత్యం వేలాది మంది ప్రయాణం నిమిత్తం ప్రయాణికులు వస్తుంటారన్నారు. అటువంటి బస్టాండ్‌లో ఈ తరహా సంఘటన చోటు చేసుకోవడం ముగ్గురు మృతి చెందడం బాధాకరమన్నారు. జరిగిన సంఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే



ఆర్థిక సహకారాన్ని అందించాలని... ఈ తరహా సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని పురందేశ్వరి డిమాండ్ చేశారు.

# నా బెయిల్ రద్దు చెయ్యాలని పురందేశ్వరి చెప్పడంలో అర్థమే లేదు



ప్రకాశం : బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి తన బెయిల్ రద్దు చెయ్యాలని చెప్పడంలో అర్థం లేదని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. పురంధేశ్వరి ఆలోచనా విధానంలో పొరపాటు ఉందన్నారు. రిఫామ్స్ తీసుకువచ్చి త్వరితగతిన కేసులు పరిష్కరించాలన్నది బీజేపీ చేతుల్లోనే ఉందన్నారు. త్వరితగతిన పరిష్కరించడానికి ఆస్తి కాదన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఏపీ ముందంజలో ఉందన్నారు. ఓటర్లే దీనికి తీర్పు ఇస్తారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఏపీలో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తామని చెబుతున్నారని తెలిపారు. తెలంగాణాలో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. విలువలు లేని పొత్తులు రాజకీయాల్లో చూస్తున్నామన్నారు. వైసీపీ ఒంటరిగానే పోటీ చేస్తోందన్నారు. ఒంగోలులో నకిలీ స్టాంపుల కుంభకోణంలో ఉన్న వారందరనీ పోలీసులు అరెస్టు చేస్తారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

# ధైర్యం ఉంటే మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి...




అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం బృందం సోమవారం పర్యటిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి రాష్ట్ర టీడీపీ వ్యవసాయ కమిటీ బృందం నిర్ణయించింది. ఈ సందర్భంగా సోమవారం అనంతపురంలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. నష్టపోయిన పంటపొలాలను పరిశీలించేందుకు టీడీపీ వ్యవసాయ స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. చంద్రబాబు హయాంలో రూ. 2,300 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్ ఇచ్చామన్నారు. వైసీపీ ప్రభుత్వం మాత్రం 111. 43 లక్షల రూపాయలు ఇన్పుట్ సబ్సిడీ అందించిందని విమర్శించారు. మంత్రులకు దమ్ము ధైర్యం ఉంటే క్షేత్రస్థాయిలో పర్యటించాలని సోమిరెడ్డి సవాల్ చేశారు.

470 మండలాలు కరువు మండలాలుగా ప్రకటించాల్సి ఉండగా 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా జగన్ ప్రభుత్వం ప్రకటించి చేతులు దులుపుకుందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. వేరుశనగకు ఎకరాకు రూ. 25 వేలు, మిరపకు 50 వేల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కరువు బారిన పడిన రైతులకు ఏం ఏం చేశారో రైతులకు చెబితే మంత్రుల మొఖాన ఉమ్మేస్తారన్నారు. కరువు బారిన పడిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ కడతామని చెప్పి రైతుల కొంపలు ముంచేశారని సోమిరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.




# గాజాను రెండుగా విభజించి.. ఇజ్రాయెల్ 'కీలక' దాడులు..!

గాజా స్ట్రిప్: హమాస్ నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేయడమే లక్ష్యంగా గాజా పట్టీపై ఇజ్రాయెల్ సాగిస్తున్న భీకర పోరులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గాజాను నలువైపులా చుట్టుముట్టిన ఇజ్రాయెల్ దళాలు.. ఈ నగరాన్ని రెండుగా విభజించినట్లు ప్రకటించాయి. "గాజా నగరాన్ని మేం చుట్టుముట్టాం.

ఇప్పుడు ఇక ఉత్తర గాజా, దక్షిణ గాజాగా విభజించాం. ఈ యుద్ధంలో ఇది చాలా ముఖ్యమైన దశ. మేం మరింత కీలకంగా దాడులు చేయబోతున్నాం" అని ఇజ్రాయె ల్ ఆర్మీ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ మీడియాకు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికే ఇజ్రాయెల్ దళాలు గాజా దక్షిణ ప్రాంతానికి చేరుకున్నాయి. మరో 48 గంటల్లో అటు వైపు నుంచి గాజా భూభాగంలోకి అడుగుపెట్టే అవకాశాలున్నట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. అటు ఉత్తర గాజాలో భీకర దాడులు కొనసాగుతున్నాయి.

**మరో మార్గం లేదు: నెతన్యాహు –** ఇదిలా ఉండగా.. బందీలను హమాస్ వదిలిపెట్టేవరకు కాల్పుల విరమణకు అంగీకరించేది లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరోసారి స్పష్టం చేశారు. "మేం గెలిచే వరకు ఈ యుద్ధం కొనసాగిస్తాం. మాకు మరో మార్గం లేదు. ఈ యుద్ధాన్ని ప్రారంభించింది హమాసే. మమ్మల్ని అంతం చేయాలని ఆ మూకా కోరుకుంది. హమాస్ చేసింది తప్పు. అందుకే మేం దాన్ని సమూలంగా నాశనం చేయాలనుకుంటున్నాం" అని నెతన్యాహు వెల్లడించారు.

**ఇరాక్‌లో బ్లింకెన్ అనూహ్య పర్యటన..** ఇజ్రాయెల్-హమాస్ పోరు నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా పశ్చిమాసియాలో దౌత్య యత్నాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే నిన్న అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్.. అనూహ్యంగా వెస్ట్‌బ్యాంక్‌కు వెళ్లి పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌తో భేటీ అయ్యారు. అక్కడి నుంచి ఇరాక్‌లోనూ అనూహ్య పర్యటన చేపట్టారు. బాగ్దాద్‌లో ఇరాక్ ప్రధాని మహ్మద్ షియా అల్ సుదానీతో సమావేశమయ్యారు. అక్కడి నుంచి తుర్కియేకు వెళ్లారు.




బెంగళూరు: కర్ణాటక గనులు, భూవిజ్ఞాన శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్న కేఎస్ ప్రతిమ హత్య ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. ఆమె శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై ఆమె తోటి సీనియర్ అధికారి ఒకరు స్పందించారు. ఆమె డైనమిక్ లేడీ అని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఘటనలో ఓ అనుమానితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక పర్యావరణ విభాగం సీనియర్ అధికారి దినేశ్ మీడియాతో మాట్లాడుతూ..'ఆమె మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె చాలా డైనమిక్‌గా ఉంటారు. సోదాలపరంగా, నిందితులపై చర్యలు తీసుకునే విషయంలో చాలా ధైర్యంగా వ్యవహరిస్తారు. తన పనితీరుతో మంచి పేరు తెచ్చుకున్నారు. ఇటీవల కూడా కొన్నిచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఆమెకు శత్రువులు ఎవరూ లేరు' అని వెల్లడించారు. అధికారి వ్యాఖ్యలతో ఇటీవల జరిపిన తనిఖీలే ప్రతిమ హత్యకు కారణమయ్యాయా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రామనగర జిల్లాలో పని చేస్తున్న కేఎస్ ప్రతిమ బదిలీపై ఇటీవలే బెంగళూరుకు వచ్చారు. విధులు ముగించుకుని దొడ్డకల్లసంద్ర గోకుల్ అపార్ట్‌మెంట్‌కు రాత్రి ఎనిమిది గంటలకు చేరుకున్నారు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె హత్యకు గురై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమెకు ఊపిరి ఆడకుండా చేసిన నిందితుడు, గొంతుకోసి హత్య చేశాడని గుర్తించినట్లు తెలిపారు. ఐదేళ్ల నుంచి ఆమె ఒక్కరే ఫ్లాట్లో ఉంటున్నారని చెప్పారు. అసలేం జరిగిందో తెలిసిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా తన సోదరి స్పందించకపోవడంతో ఆమె సోదరుడు ప్రతీక్, దిగువ అంతస్తులో ఉన్న వారికి ఫోన్ చేశారు. వారు వచ్చి చూసేసరికి ప్రతిమ హత్యకు గురైందని శనివారం అర్ధరాత్రి తెలిసింది. ఈ హత్యకు సంబంధించి సమగ్ర దర్యాప్తునకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదేశించారు. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా తుడకి గ్రామానికి చెందిన ప్రతిమకు 18 ఏళ్ల క్రితమే సత్యనారాయణతో వివాహమైంది. భర్త, ఆమె కుమారుడు తీర్థహళ్లిలో ఉంటున్నారని ప్రతీక్ తెలిపారు.

**డ్రైవర్ అరెస్టు..** అధికారిణి హత్య కేసుకు సంబంధించి, తొలి అరెస్టు చోటుచేసుకుంది. 'ఈ హత్యకేసులో అనుమానితుడిని అరెస్టు చేశాం. అతడు ఒక డ్రైవర్. ఇటీవలే అతడిని పని నుంచి తొలగించారు' అని బెంగళూరు పోలీసు కమిషనర్ వెల్లడించారు. తనను పని నుంచి తొలగించడం వల్లే హత్య చేశానని నిందితుడు అంగీకరించినట్లు సమాచారం. దీంతో పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# మంత్రి పెద్దిరెడ్డిపై కాలవ శ్రీనివాసులు ఫైర్

అనంతపురం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి అనంత జిల్లా ముందెప్పుడూ లేని దుర్భిక్షంలో ఉందన్నారు. హంద్రీనీవాలో నిలువ చేయాల్సిన నీటిని పుంగనూరుకు తరలిస్తున్నారని.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనంత జిల్లాను ఎడారిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీప భవిష్యత్‌లో తాగునీటి కూడా ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. "ఉమ్మడి అనంత జిల్లా ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారు?.. మీకెందుకు ఆ పదవులు. మీరంతా దద్దమ్మలు... చేతకాని వారు" అంటూ విరుచుకుపడ్డారు.

తక్షణం జిల్లాకు తాగునీటిని విడుదల చేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. వైసీపీ ప్రజా ప్రతినిధులకు బాధ్యత లేదా... కృష్ణ జలాలను తరలించడం వెంటనే ఆపాలి అని కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

# ఆంధ్రప్రదేశ్‌లో దీపావళి సెలవు తేదీలో మార్పు.. సీఎస్ ఉత్తర్వులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో దీపావళి పండుగ సెలవును ఈ నెల 13వ తేదీకి మారుస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 13న సాధారణ సెలవుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ప్రభుత్వం విడుదల చేసిన సెలవుల జాబితా ప్రకారం ఈ నెల 12న (ఆదివారం) దీపావళి సెలవుగా ఉంది. ఈ క్రమంలో సాధారణ సెలవులు, ఆప్షనల్ సెలవుల జాబితాలో స్వల్ప మార్పులు చేశారు. నవంబర్ 13వ తేదీన (సోమవారం) ఆప్షనల్ హాలిడే బదులుగా సాధారణ సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది.

# మరోసారి ఏఐజీ ఆస్పత్రికి చంద్రబాబు



హైదరాబాద్: టీడీపీ అధినత చంద్రబాబు నాయుడు మరోసారి గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వెళ్లనున్నారు. ఈరోజు ఉదయం 11 గంటలకు ఏఐజీకి చంద్రబాబు చేరుకోనున్నారు. ఇప్పటికే రెండు రోజుల పాటు ఏఐజీలో టీడీపీ అధినేత వైద్య పరీక్షలు చేయించుకున్న విషయం తెలిసిందే. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈరోజు చంద్రబాబుకు వైద్య బృందం పలు వైద్య పరీక్షలతో పాటు చర్మ సంబంధ చికిత్స చేయనున్నారు. మంగళవారం చంద్రబాబు కంటికి క్యాటరాక్ట్ ఆపరేషన్ జరుగనుంది.

# బ్లాక్ డ్రెస్ లో పాయల్ పరువాల విందు..!

పాయల్ రాజ్ పూత్ కి పరిచయం అవసరం లేదు. ఆమె అందానికి ఎవరైనా ఫిదా కావాల్సిందే. ఆర్ఎక్స్ 100 సినిమాతో ఆమె టాలీవుడ్ లో కెరీర్ మొదలుపెట్టింది. ఆ సినిమాలో పాయల్ క్యారెక్టర్, అందానికి అందరూ ఫిదా అయిపోయారు. ఆ సినిమాలో ఆమె కొంచెం నెగిటివ్ షేడ్స్ లో నటించింది. మొదటి సినిమాకే, అలాంటి రోల్ చేయడం సాహసమనే చెప్పాలి. కాగా, పాయల్ సోషల్ మీడియాలో యమా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. ముఖ్యంగా బోల్డ్ ఫోటో షూట్ చేయడంలో పాయల్ ఎప్పుడూ ముందుంటుంది. కానీ, తాజాగా



మాత్రం బ్లాక్ కలర్ డ్రెస్ లో మోడ్రన్ టచ్ ఇచ్చింది. ఈ డ్రెస్ లో పాయల్ చాలా అందంగా ఉంది. ఆ డ్రెస్ కి కరెక్ట్ గా సెట్ అయ్యేలా ముస్తాబైంది. ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారాయి. అయితే, ఈ మధ్య పాయల్ తెరపై కనిపించి చాలా రోజులు అవుతోంది. ఈ క్రమంలో 'మంగళవారం' అనే సినిమాతో మన ముందుకు రావడానికి రెడీ అయ్యింది. ఈ మూవీ ట్రైలర్ కూడా ఇటీవల విడుదల చేయగా, విపరీతంగా ఆకట్టుకుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తో మళ్లీ హిట్ కొడతాననే నమ్మకంతో పాయల్ ఉంది. ఆర్ఎక్స్100 తో హిట్ కొట్టిన అజయ్ భూపతి, ఆ తర్వాత మహా సముద్రం సినిమా తీశారు. సిద్దార్థ్, శర్వా లాంటి స్టార్స్ నటించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. దీంతో, ఈసారి అజయ్ రూట్ మార్చి, ఇంట్రస్టింగ్ కథతో మన ముందుకు రావడానికి రెడీ అయ్యారు. మరి ఈ మూవీతో పాయల్ మళ్లీ ఫామ్ లోకి వస్తుందో లేదో చూడాలి. ఇదిలా ఉండగా, ప్రస్తుతం పాయల్ చేతిలో రెండు, మూడు సినిమాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఓ వైపు మాయా పేటిక అనే సినిమా చేస్తోంది. ఈ మూవీ కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ప్రేమలో పడిన రాశీఖన్నా?

దిల్లీ బ్యూటీ రాశీఖన్నా ముంబై పరిశ్రమలో నెమ్మదిగా తన పరిధిని విస్తరిస్తోంది. అంతేకాదు.. ఇండస్ట్రీలో తన స్నేహాలను కూడా పెంచుకుంటోంది. అంతేకాదు ఇప్పుడు రాశీ ప్రేమలో పడిందని సమాచారం. అయితే రాశీ ఎవరితో ప్రేమలో పడింది? తన సహచరి, స్నేహితురాలు తమన్నా తరహాలో కోస్టార్ తో ప్రేమలో పడిందా? అంటే అలాంటిదేమీ లేదు. ఇటీవలే రాశీ ఓ ప్రేమకథ విందిట. ఆ స్క్రిప్టుతో ప్రేమలో పడిందని తెలిసింది. ఒక అందమైన అమ్మాయి చిన్న టౌన్ నుంచి మెట్రో నగరంలోకి అడుగుపెడుతుంది. అక్కడ ఒక ఆకతాయి అబ్బాయితో స్నేహం చేసి అతడితో నిండా ప్రేమలో మునుగుతుంది. అటుపై ఆ ఇద్దరి జీవితాల్లో ఏం జరిగిందనేదే ఈ సినిమా కథాంశం. ఇక ఆకతాయి కుర్రాడిగా యువహీరో విక్రాంత్



మాస్సే నటిస్తుండగా, అందాల రాశి ఖన్నా అతడి ప్రేయసిగా కనిపించనుంది. ఈ చిత్రానికి నూతన దర్శకుడు బోధయన్ రాయ్ చౌదరి దర్శకత్వం వహించనున్నారు. ముంబై నేపథ్యంలో సాగే ఓ చమత్కారమైన ప్రేమకథతో ఈ సినిమా రూపొందనుందని సమాచారం. షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైందని, నవంబర్ 2023 నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నామని, 2024 ప్రథమార్థంలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నామని మేకర్స్ చెబుతున్నారు. ఇద్దరు ప్రతిభావంతులు ఎవరికి వారు కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్ లో ఉన్నారు. విక్రమ్ మాస్సే –రాశీ ఖన్నా ఇద్దరూ ఇటీవల వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. మాస్సే గ్యాస్‌లైట్ – ముంబైకర్ చిత్రాల్లో అద్భుత నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. మాస్సే ప్రస్తుతం విధు వినోద్ చోప్రా 'ట్వల్త్ ఫెయిల్' విడుదల కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 27 న థియేటర్లలోకి రానుంది. మరోవైపు రాశీ ఖన్నా మద్రాస్ కేఫ్‌తో హిందీ సినిమాలో కెరీర్ ప్రారంభించి, ఇటీవలే రాజ్ అండ్ డీకే ఫర్జీ వెబ్ సిరీస్‌లోను నటించి మెప్పించింది. రుద్ర అనే వెబ్ సిరీస్ తోను పేరు తెచ్చుకుంది. తదుపరి 'యోధా'లో రాశీ ఒక కీలక పాత్రను పోషించింది.




# ఒకే రోజు రెండు అరవ సినిమాల కొట్లాట..!





వీకెండ్ వచ్చిందంటే చాలు సినిమాల రిలీజ్ ల సందడి ఆడియన్స్ ని అలరించే ప్రయత్నం చేస్తాయి. స్టార్ సినిమాలు లేని టైం లో మీడియం, లో బడ్జెట్ సినిమాలు రిలీజ్ లు జరుగుతుంటాయి. తెలుగు మార్కెట్ మీద తమిళ సినిమాల హవా తెలిసిందే. కొద్దిగా క్రేజ్ ఉన్న సినిమాలన్నీ కూడా తెలుగులో రిలీజ్ చేస్తుంటాయి. రాబోయే వారం నవంబర్ 10న రెండు తమిళ సినిమాలు బాక్సాఫీస్ ఫైట్ కి సిద్ధంగా ఉన్నాయి. తమిళ హీరో కార్తీ లీడ్ రోల్ లో రాజ్ మురుగన్ డైరెక్షన్ లో జపాన్ సినిమా శుక్రవారం రిలీజ్ కు రెడీ అయ్యింది. దీనికి పోటీగా కార్తీక్ సుబ్బరాజు డైరెక్షన్ లో జిగర్ తండా డబుల్ ఎక్స్ సినిమా కూడా వస్తుంది. జిగర్ తండా సినిమా తమిళంలో సూపర్ హిట్ కాగా ఆ సినిమాను తెలుగులో గద్దలకొండ గణేష్ గా రీమేక్ చేశారు. హరీష్ శంకర్ డైరెక్ట్ చేసిన గద్దలకొండ గణేష్ సినిమాలో వరుణ్ తేజ్ నటించాడు. అయితే జిగర్ తండా డబుల్ ఎక్స్ అంటూ ఆ సినిమాకు సీక్వెల్ గా ప్లాన్ చేశారు. జిగర్ తండా సీక్వెల్ కి ఫస్ట్ పార్ట్ కి కథ పరంగా ఎలాంటి సంబంధం లేదని తెలుస్తుంది. లారెన్స్ లీడ్ రోల్ లో ఎస్.జె సూర్య విలన్ గా ఈ సినిమా వస్తుంది. ఈ శుక్రవారం కార్తీ జపాన్ కి పోటీగా జిగర్ తండా 2 కూడా వస్తుంది. ఈ రెండు తమిళ సినిమాలు దీపావళికి తెలుగు మార్కెట్ ని క్యాష్ చేసుకోవాలని తెలుగులో భారీ రిలీజ్ అవుతున్నాయి. తెలుగులో ఆల్రెడీ కార్తీకి మంచి ఫాలోయింగ్ ఉంది. జపాన్ టీజర్, ట్రైలర్ ఇంప్రెసివ్ గా ఉన్నాయి కాబట్టి కార్తీ సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉంది. కార్తీక్ సుబ్బరాజు ఫ్యాన్స్ కూడా తెలుగులో ఉన్నారు. లారెన్స్ సినిమాలను ఇష్టపడే వారు కూడా జిగర్ తండా 2 చూసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఈ రెండు సినిమాల మధ్య ఫైట్ ఆసక్తికరంగా మారింది. ఈ వీకెండ్ ఎలాగు తెలుగు సినిమాలేవి రిలీజ్ అవ్వట్లేదు కాబట్టి రెండు అరవ సినిమాలకు మంచి ఛాన్స్ అని చెప్పొచ్చు. మరి ఈ సినిమాల్లో ఏ మూవీ తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తుందో చూడాలి. రెండు సినిమాలను తెలుగులో బాగా ప్రమోట్ చేస్తున్నారు. జపాన్ సినిమాను తెలుగులో నాగార్జునబ అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా రిలీజ్ చేస్తున్నారు

# పుష్ప దెబ్బకి సింగం వెనకడుగు





ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప 2 ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న ఈ మూవీపై దేశ వ్యాప్తంగా అంచనాలు ఉన్నాయి. అందుకు తగ్గట్లుగానే ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్ కి విశేషమైన రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్ గా పుష్ప సినిమాలో పుష్ప రాజ్ పాత్రకిగాను అల్లు అర్జున్ కి బెస్ట్ యాక్టర్ గా నేషనల్ అవార్డు వచ్చింది. దీంతో పుష్పరాజ్ పాత్రపై వెయిటేజ్ పెరిగిందని చెప్పాలి. దీంతో సుకుమార్ మరింత బాధ్యత తీసుకొని పుష్ప రాజ్ పాత్రని ప్రేక్షకులకి బలంగా రీచ్ చేయాలని ఫిక్స్ అయ్యారు. షూటింగ్ ఆలస్యం అవుతున్న పెర్ఫెక్షన్ కోసం ఎక్కువ టైం తీసుకుంటున్నారు. ఇక అల్లు అర్జున్ కూడా తనకొచ్చిన పాన్ ఇండియా ఇమేజ్ ని మరింత స్ట్రాంగ్ గా ఎస్టాబ్లిష్ చేసుకోవాలని చూస్తున్నాడు. ఇక పుష్ప 2 కోసం దేవిశ్రీ ప్రసాద్ కూడా గట్టిగానే కష్టపడుతున్నారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ఎనౌన్స్ చేశారు. వచ్చే ఏడాది ఆగష్టు 15న రిలీజ్ చేయనున్నట్లు పోస్టర్ తో కన్ఫర్మ్ చేశారు. అయితే అదే సమయంలో హిందీలో రోహిత్ శెట్టి సింగం సిరీస్ లో మూడో భాగం రానుంది. ఎప్పుడో ఆగష్టు 15 వీకెండ్ లో రావాలని రోహిత్ శెట్టి ప్లాన్ చేసుకున్నారు. సింగం అగైన్ టైటిల్ తో రాబోయే ఈ మూవీకి హిందీలో మంచి ఫ్యాన్ బేస్ ఉంది. అయితే పుష్ప 2తో పోల్చుకుంటే మాత్రం సెకండ్ ఛాయస్ అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. అంతగా నార్త్ ఇండియన్స్ పుష్పకి అడిక్ట్ అయిపోయారు. ఈ నేపథ్యంలో పుష్ప 2తో పోటీ పడటం ఎందుకని ఆలోచించి మరో డేట్ ఫిక్స్ చేసుకునే పనిలో రోహిత్ శెట్టి టీం ఉంది. పుష్ప2తో పోటీ పడితే కచ్చితంగా కలెక్షన్స్ పరంగా ఎఫెక్ట్ ఉంటుందని ముందుగానే జాగ్రత్త పడుతున్నారు. ఒక వేళ సింగం అగైన్ మూవీ వాయిదా పడిన పుష్ప 2కి పోటీగా శంకర్ ఇండియన్ 2 ఉండే ఛాన్స్ ఉంది. ఈ మూవీ అదే టైంలో రిలీజ్ అయితే కొంత టఫ్ ఫైట్ ఉంటుంది. కోలీవుడ్ లో మాత్రం మొదటి ప్రాధాన్యత ఇండియన్ 2కి ఉంటుంది. ఇక మిగిలిన భాషలలో పుష్ప 2 ఫస్ట్ ఛాయస్ గా ఉంటుంది. మరి పుష్ప రాజ్ స్పీడ్ ని తట్టుకొని ఎవరైనా పోటీకి నిలబదతారో లేదో తెలియాలంటే వేచి చూడాల్సిందే.

# వామ్మో దక్షా.. ఏంటా అందాలు..!

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ దక్ష నగార్కర్ కి పరిచయం అవసరం లేదు. చేసింది చాలా తక్కువ సినిమాలు అయినా, గుర్తింపు మాత్రం చాలా తొందరగానే సంపాదించుకుంది. అయితే, గుర్తింపు వచ్చినా, స్టార్ హీరోయిన్ కాదు కదా, మీడియం రేంజ్ హీరోయిన్ కూడా కాలేకపోయింది. అయితే, ఆమె అందానికి మాత్రం వంక పెట్టే పని లేదు. చూడగానే ఎవరినైనా ఆకర్షించేలా ఉంటుంది. ఎలాంటి క్యారెక్టర్ వచ్చినా, సులభంగా చేయగల సత్తా కూడా ఉంది. అయితే, సినిమాల్లో అవకాశాలు రాకున్నా, సోషల్ మీడియాలో మాత్రం చాలా చురుకుగా ఉంటుంది. తాజాగా కొన్ని ఫోటోలు షేర్ చేయగా, అవి వైరల్ గా మారాయి. సూపర్ మోడల్ లాగా ముస్తాబై కనిపించింది. చాలా స్టైలిష్ గా ఉంది. ఆ డ్రెస్ కూడా స్పెషల్ గా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఆ డ్రెస్ లో నుంచి తన ఎద అందాలు



క్లియర్ గా కనిపించేలా డిజైన్ చేయడం విశేషం. మరోవైపు థైస్ షో కూడా చేసింది. ఇక, కళ్లకు గాగుల్స్ పెట్టి, హెయిర్ లీవ్ చేసి, స్టైలిష్ గా ఫోజులు ఇచ్చింది. ఓ కాఫీ షాప్ లో ఈ ఫోటోలు దిగినట్లు తెలుస్తోంది. ఆమె ఫోటోలు షేర్ చేసిన గంటల్లోనే అవి వైరల్ గా మారాయి. ఇక, కామెంట్ల గురించి అయితే, స్పెషల్ గా చెప్పర్లేదు. ఆమె అందాలను విపరీతంగా పొగిడేస్తున్నారు. ఇక, దక్ష తొలిసారి హురాహూరీ అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. కానీ, ఆ సినిమా గురించి కూడా ఎవరికీ తెలియకపోవడంతో దక్షకు పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ, ఆ తర్వాత హుషారు అనే మూవీతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీ క్లిక్ అయినా, దక్షకు పెద్దగా ఛాన్సులు రాలేదనే చెప్పాలి. జాంబిరెడ్డి, బంగార్రాజు వంటి చిత్రాలు హిట్ అయినా, దక్ష కెరీర్ కి ఉపయోగపడేలేదు. రవితేజ రావణాసురలో అవకాశం వచ్చింది కానీ, ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఆ తర్వాత ఆమెకు మళ్లీ ఆఫర్లు రాలేదు. కొత్తగా సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. మరి, ఫ్యూచర్ లో ఆమెకు ఎలాంటి అవకాశాలు వస్తాయో చూడాలి.

# కొత్త పద్యం పాడుతున్న వాణీ..ఇలా ఇంకెన్నాళ్లు?

నేటితరంలో పర్ఫెక్ట్ ఫ్యాషన్ సెన్స్ తో అలరిస్తున్న స్టైల్ ఐకాన్ గా వాణీకపూర్ పేరు మార్మోగుతోంది. ఈ బ్యూటీ నిరంతర ఫ్యాషన్ ఎంపికలు, ప్రయోగాలు యువతరంలో అగ్గి రాజేస్తున్నాయి. తాజాగా వాణీ మరో లేటెస్ట్ ఫోటోషూట్ తో విరుచుకుపడింది. చాలా సింపుల్ గా పొడుగు కాళ్ల సౌందర్యాన్ని ఎలివేట్ చేస్తూ డెనిమ్ షార్ట్ ధరించిన ఈ బ్యూటీ లైట్ స్లీవ్ టాప్ ధరించి టూహాట్ గా కనిపిస్తోంది. అయితే అక్కడ వాణీ తన అందాలను కవర్ చేయడానికి ఒక బ్లేజర్ లాంటి కోట్ ని ధరించింది. తాజా ఫోటోషూట్ కి వాణీ అద్భుతమైన క్యాప్షన్ ని కూడా ఇచ్చింది. కొండలలో ఒక నివాసం, చాలా సుందరమైన.. నిర్మలమైన దృశ్యంతో...ఒంటరిగా గంటలు దాటి, ఆకాశం దాటి మేఘాలు .. నశ్వరమైన ఆలోచనలతో, మిస్టరీ తో.. అద్భుత ప్రకాశంతో మళ్లీ ప్రేమలో పడటం ఇదే నా ప్రయాణం అని వాణీ కవితాత్మక వర్ణనను రాసింది. తాజాగా పాపులర్ లైఫ్ స్టైల్ మ్యాగజైన్ ఇంటర్వ్యూలో తన ఫ్యాషన్ ఎంపికలపై వాణి కపూర్ చాలా



సంగతులే చెప్పింది. ఫ్యాషన్ అండ్ ట్రెండ్స్ ఎంపికలు తన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయని వాణీ తెలిపింది. నాలో ఫ్యాషన్ పెద్ద భాగం. నా సృజనాత్మకత, వ్యక్తిత్వం, శైలిని నేను నా ఫ్యాషన్ సెన్స్ ద్వారానే వ్యక్తపరుస్తాను. నా ఫ్యాషన్ ఎంపికలను ప్రజలు మెచ్చుకున్నప్పుడు అది అద్భుతంగా అనిపిస్తుంది.. అని తెలిపింది. ఎడ్జీ నుండి క్లాసిక్ వరకు... డేరింగ్ స్టైల్ నుండి సింపుల్ లుక్ వరకు రకరకాల స్టైల్‌లను అనుకరించగలనని వాణీ తెలిపింది. పాశ్చాత్య లేదా భారతీయ దుస్తుల ఎంపిక ఏదైనా, చేసే పనిలో తన హృదయాన్ని ఆత్మను ఉంచుతానని తెలిపింది. వాణి మాట్లాడుతూ– నా ఫ్యాషన్ సెన్స్ కొత్త విషయాల సమ్మేళనంగా ఉండాలని నేను భావిస్తాను. నేను నా స్వంత పద్ధతిలో దుస్తులు ధరించడాన్ని చాలా ఆనందిస్తాను. నాకు ఆత్మవిశ్వాసం కలిగించడంలో సహాయపడుతుంది. పాశ్చాత్య దుస్తులు ధరించినా లేదా భారతీయ దుస్తులలో ఉన్నా నా హృదయాన్ని అందులో ఉంచుతాను. విభిన్న రూపాలతో ప్రయోగాలు చేయడం నాకు ఇష్టం.. రంగులు ఆకారాలలో ప్రయోగాలు చేస్తాను అని వాణీ తెలిపింది. కపూర్ ఫ్యాషన్ సెన్స్‌ను అభిమానులు తోటి సెలబ్రిటీలు సహా చాలా మంది ప్రశంసించారు. ఆమె అనేక ఫ్యాషన్ మ్యాగజైన్‌లకు ముఖచిత్రంగా ముద్రించబడింది.




దేవరకద్ర: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓటర్లు పరిణతితో ఆలోచించి ఓటేస్తేనే ప్రజాస్వామ్యం గెలుస్తుందని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్రలో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ఓటును సరిగ్గా వాడితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అభ్యర్థి వెనుక ఉన్న పార్టీల గురించి కూడా ఆలోచన చేసి ఓట్లేయాలని ప్రజలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. "గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదు. వలసలు వెళ్లి చాలా బాధలు అనుభవించిన జిల్లా పాలమూరు. గతంలో పాలమూరు ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులకు కాంగ్రెస్ కారణం కాదా?" అని కేసీఆర్ ప్రశ్నించారు. దేవరకద్ర నియోజకవర్గ భారాస అభ్యర్థి వెంకటేశ్వర రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ హయాంలో 24 గంటల విద్యుత్ ఎందుకివ్వలేదు?: కేటీఆర్



ఎల్లారెడ్డిపేట: ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు అడుగుతున్నారని, గతంలో 11 ఛాన్స్‌లు ఇస్తే రాష్ట్రానికి ఆ పార్టీ ఏం చేసిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో 24 గంటల విద్యుత్ ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. హస్తం పార్టీ అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలో చీకట్లు అలముకుంటాయన్నారు. ఎన్నికల తర్వాత కేసీఆర్ బీమా అమలు చేసుకుందామన్నారు. తెల్లకార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ. 5 లక్షల బీమా ఇవ్వబోతున్నట్లు చెప్పారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన భారాస యువ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. "కేసీఆర్‌ను ఓడించేందుకు దిల్లీ నుంచి చాలా మంది వస్తున్నారు. సింహం మాత్రం సింగిల్‌గానే వస్తుంది. కాంగ్రెస్ నేతలు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా దిల్లీ నేతలపైనే ఆధారపడతారు. ఎన్నికలు రాగానే పొలిటికల్ టూరిస్టులు అనేక మంది వస్తారు. ఏవేవో మాటలు చెబుతారు. ప్రజలు ఆగం కావొద్దు. దొరల తెలంగాణ కావాలా.. ప్రజల తెలంగాణ కావాలా అని రాహుల్ గాంధీ అడుగుతున్నారు. ఆయనకు నేను చెప్పేది ఒకటే.. దొరలు ఎవరో తెలంగాణ ప్రజలు ఇప్పటికే తెలుసుకున్నారు. వారే మీకు సరైన పద్ధతిలో సమాధానం ఇస్తారు" అని కేటీఆర్ అన్నారు. టీఎస్‌పీఎస్సీలో కొన్ని తప్పులు జరిగిన మాట వాస్తవమేనని, లోపాలను కచ్చితంగా ప్రక్షాళన చేస్తామని కేటీఆర్ అన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు. గత పదేళ్లలో 2 లక్షల 30 వేలకుపైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. అందులో 1 లక్ష 60 వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# భాజపా తరపున ప్రచారానికి మోదీ సహా 40 మంది ముఖ్యనేతలు




హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల్లో భాజపా అభ్యర్థుల తరపున ప్రచారానికి ఆ పార్టీ ముఖ్యనేతలు రాష్ట్రానికి రానున్నారు. మొత్తం 40 మంది నేతలు ప్రచారంలో పాల్గొననున్నట్లు భాజపా ప్రకటించింది. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులు ఈ ప్రచారానికి రానున్నారు. ఈ మేరకు ముఖ్యనేతల పేర్లను భాజపా వెల్లడించింది. ఈ జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలూ ఉన్నారు.

**ప్రచారం నిర్వహించనున్న నేతలు :** నరేంద్ర మోదీ, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, నితిన్ గడ్కరీ, యడియూరప్ప, కె.లక్ష్మణ్, యోగి ఆదిత్యనాథ్, పీయూష్ గోయల్, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, పురుషోత్తం రూపాలా, అర్జున్ ముండా, భూపేంద్రయాదవ్, కిషన్‌రెడ్డి, సాధ్వి నిరంజన్ జ్యోతి, ఎల్.మురుగన్, ప్రకాశ్ జావడేకర్, తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, బండి సంజయ్, అరవింద్ మేనన్, డీకే అరుణ, పి.మురళీధర్‌రావు, దగ్గుబాటి పురందేశ్వరి, రవికిషన్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు, రాజాసింగ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, టి.కృష్ణ ప్రసాద్.

# అప్పట్లో కేసీఆర్‌ను కడుపులో పెట్టుకుని గెలిపించినం కానీ..



వికారాబాద్ : నామినేషన్ వేసేందుకు తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేరుకున్నారు. ఆయనకు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాద బలంతో ముందుకు నడుస్తున్నానన్నారు. కొడంగల్ జనం ఆలోచించాలని.. తనకు ఇచ్చిన హెూదా, పదవి మీదేనన్నారు. కొడంగల్ ప్రతి బిడ్డా పీసీసీ అధ్యక్షుడేనని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కొడంగల్‌ను గజ్వేల్.. సిరిసిల్ల.. సిద్దిపేట లాగా అభివృద్ధి చేస్తామని.. కృష్ణా నీటిని తెస్తామని చెప్పి గెలిచారన్నారు. ఆ మాటలు నమ్మి గురునాథ్ రెడ్డి బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేశారని.. కానీ అవన్నీ మోసపు మాటలుగానే మిగిలాయన్నారు. గొల్ల కురుమలు డీడీలు కట్టారు కానీ ఒక్క గొర్రె కూడా ఇవ్వలేదని రేవంత్ తెలిపారు. "2009లో కరీంనగర్ నుంచి కేసీఆర్ పారిపోయి పాలమూరుకు వస్తే మేము కడుపులో పెట్టుకుని గెలిపించినం. కొడంగల్ నుంచి పోటీ చేయమని నేను కేసీఆర్‌కు సవాల్ విసిరితే.. ఇక్కడ ఇచ్చిన ఒక్క మాట కూడా నెరవేర్చలేదు. కనుక ఇక్కడి నుంచి కేసీఆర్ పోటీ చేయడం లేదు. ఈ ఎన్నికలు మన కొడంగల్‌కు ప్రత్యేక గుర్తింపును తెస్తాయి. మనను చరిత్రలో నిలబెడతాయి. ఇక్కడి ఎమ్మెల్యే ఒక్కసారి కూడా కొడంగల్ కోసం అసెంబ్లీలో అడగలేదు.

మరి ఇపుడు ఓట్లు ఎట్లా అడుగుతాడు? కొడంగల్ కోసం నేను, గురునాథ్ రెడ్డి.. సందారం కుటుంబం ఏకమయ్యాం. మీరంతా కూడా ఏకం కావాలి. కర్ణాటకలో పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు లక్షకు పైగా మెజారిటీ ఇచ్చారు. మరి ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి అంతకన్నా ఎక్కువగా మెజారిటీ ఇప్పించాలి. ఇక్కడ అన్ని అభివృద్ధి పనులు కోసం నేను బాధ్యత తీసుకుంటా" అని రేవంత్ పేర్కొన్నారు.

# హంగ్ వస్తే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి

హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. నీళ్ళు, నియామకాల విషయంలో సీఎం కేసీఆర్ సంపూర్ణంగా విఫలమయ్యారని, రియల్ ఎస్టేట్ వ్యాపారి మాదిరిగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల 5,800 ఎకరాల భూమిని అభివృద్ధి పేరిట అతి చౌక ధరలకు కేసీఆర్ కుటుంబం తీసుకుందని ఆరోపించారు. ఒక్క గజ్వేల్‌లోనే 30 వేల మంది కేసీఆర్ బాధితులున్నారని, ఆయన అడుగులకు మడుగులు వత్తే వారికే బీసీ బంధు ఇచ్చారని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఎన్నికల్లో హంగ్ వస్తే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని ఈటల రాజేందర్ అన్నారు. గతంలో కలసి పనిచేసిన చరిత్ర కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్,




బీజేపీ ఒక్కటైతే తాను గజ్వేల్‌లో ఎందుకు పోటీ చేస్తానని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ గతంలో ఎప్పుడూ కలసి పోటీ చేయలేదని, బీజేపీపై విష ప్రచారం చేస్తున్నారని, బీఆర్ఎస్‌ను నిలువరించే సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉందని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

# భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీని పరుగులెత్తించా: బండి సంజయ్

కరీంనగర్: భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించాక పార్టీని పరుగులెత్తించానని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తన నామినేషన్ సందర్భంగా కరీంనగర్‌లో భాజపా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కలిసి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జరిగిన దుబ్బాక, జీహెచ్ఎంసీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 150 రోజుల పాటు ప్రజాసంగ్రామ యాత్ర చేసి కాషాయ జెండాను తెలంగాణ అంతటా రెపరెపలాడించానన్నారు. "రాష్ట్రంలో ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా పోరాడితే నాపై 30 దొంగ కేసులు పెట్టారు. నాపై మతతత్వవాది అనే ముద్ర వేసే ప్రయత్నం చేశారు. ధర్మం కోసం పోరాడేది భాజపా. రాజాసింగ్, నేను.. ధర్మం కోసం పోరాడేవాళ్లం. మేం ఎప్పుడూ కాషాయజెండాను



వదిలిపెట్టలేదు. ఎన్నికల్లో భాజపా కార్యకర్తలు ఒక్కొక్కరు 10 ఓట్లు వేయించాలి" అని సంజయ్ పిలుపునిచ్చారు.




## ఎన్నికల ముందు మాజీ మంత్రి రాజీనామా.. బీఆర్ఎస్‌లో చేరికకు ముహూర్తం ఫిక్స్

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముందు ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. టికెట్లు ఆశించి, పార్టీలో అసంతృప్తిగా ఉన్న నేతలంతా వేరే పార్టీల్లోకి జంప్ అయిపోతున్నారు. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి.

కాంగ్రెస్ నుంచి కారెక్కడం.. కమలం కండువా తీసేసి హస్తం గూటికి చేరడం ఇవన్నీ చకచకా జరిగిపోతున్నాయి. కాంగ్రెస్‌లోకి వలసల వర్షం కురుస్తోందను కున్న సమయంలో ఆ పార్టీకి సీనియర్లు ఒక్కొక్కరుగా వీడుతున్న పరిస్థితి. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోగా.. తాజాగా సీనియర్ నేత, మాజీ మంత్రి బోడ జనార్ధన్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి ఫ్యాక్స్ చేశారు.

**రాజీనామా ఎందుకు..? :** ఇటీవల సీనియర్ నేత, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, ఆయన కుమారుడు వంశీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ఇద్దరికీ కూడా కాంగ్రెస్ దాదాపు టికెట్లు ఫిక్స్ చేసిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. చెన్నూరు ఎమ్మెల్యే టికెట్ వంశీకి.. పెద్దపల్లి ఎంపీ టికెట్ వివేక్‌కు ఇవ్వబోతున్నారని.. ఇక అధికారిక ప్రకటనే తరువాయి అని తెలిసింది. దీంతో చెన్నూరు టికెట్ ఆశించిన బోడ జనార్ధన్ తీవ్ర అసంతృప్తికి లోనై రాజీనామా చేశారు. మంగళవారం నాడు సీఎం కేసీఆర్ సమక్షంలో జనార్ధన్ గులాబీ కండువా కప్పుకోబోతున్నారు. మందమర్రి బీఆర్ఎస్ సభలో ఈ చేరిక కార్యక్రమం జరగనుంది.

**ఓడిస్తా..! :** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో సభ్యత్వం లేని మాజీ ఎంపీ వివేక్‌ను తెరపైకి తేవడం అన్యాయమన్నారు. కాంగ్రెస్‌లో కోట్ల రూపాయలకు టికెట్లు అమ్ముకుంటున్నారని.. ఒకే కుటుంబానికి ఎన్ని టికెట్లు ఇస్తారు..? అని ఆయన ప్రశ్నించారు. వివేక్‌తో పాటు ఆయన సోదరుడు వినోద్‌ను.. ఆ కుటుంబంలో ఎవరికి టికెట్ ఇచ్చినా కచ్చితంగా ఓడిస్తామని బోడ జనార్ధన్ శపథం చేశారు. మరోవైపు.. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నేత సంజీవ రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన ఎన్ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డికి టికెట్ ఇవ్వడంపై ఈ నేతలంతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెబల్‌గా పోటీలో ఉండి శ్రీనివాస్ రెడ్డిని ఓడిస్తామని హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అన్ని పార్టీల్లో కామన్‌గా జంపింగ్‌లు, చేరికలు కనిపిస్తుంటాయ్. బీఆర్ఎస్‌లో బోడె పరిస్థితేంటి..? ఇప్పటికిప్పుడు టికెట్ ఇవ్వలేకపోయినా.. రేపొద్దున్న ఈయనకు పార్టీ ఏ మాత్రం ప్రాధాన్యత ఇస్తుందో లేదో చూడాలి మరి.

# రాములమ్మకు ఇది అవమానమేనా?

హైదరాబాద్: విజయశాంతి ఒకప్పుడు స్టార్ క్యాంపెయినర్. ఆమె అభిమానులందరూ ముద్దుగా రాములమ్మ అని పిలుచుకుంటారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ బోలెడంత మంది అభిమానులు ఉన్నారు. అంతటి ఫాలోయింగ్ ఉన్న ఆమె పట్ల పువ్వు పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇది వ్యూహాత్మకమా? లేదంటే పక్కా ప్లాన్‌తో ఇలా చేశారో తెలియదు గానీ.. బీజేపీ స్టార్ క్యాంపెయినర్ లిస్టులో రాములమ్మ ఊసే కనిపించలేదు. ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఆమే స్టార్ క్యాంపెయినర్. అలాంటిది కాషాయ పార్టీ మాత్రం ఆమెను పక్కనపెట్టేసింది.




దీనికి ఈ పార్టీ సీనియర్లు కొందరు గట్టు దాటడమే కారణంగా తెలుస్తోంది. ఇటీవల కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఊహించని విధంగా హస్తం గూటికి చేరిపోయారు. అదే కోవలో విజయశాంతి కూడా ఉన్నట్లు కమలం పార్టీ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇందులో భాగంగానే బీజేపీ స్టార్ క్యాంపెయినర్ లిస్టులో రాములమ్మకు చోటు దక్కనట్లుగా సమాచారం.

**40 మందితో బీజేపీ లిస్టు..** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున 40 మంది ప్రచారం చేయనున్నారు. ఈ లిస్ట్‌లో ప్రధాని మోదీ, నడ్డా, రాజ్ నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, యూపీ సీఎం యోగీ ఆదిత్య నాథ్, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప సహా పలువురు జాతీయ నేతలు ఉన్నారు.

క్యాంపెయినర్ లిస్ట్‌లో రాష్ట్రం నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల, రాజాసింగ్, లక్ష్మణ్, డీకే అరుణ, ఎంపీ అర్వింద్, జితేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వరెడ్డి తదితరులు ఉన్నారు.

**మార్పు ఖాయమా? :** బీజేపీ స్టార్ క్యాంపెయినర్ లిస్టులో విజయశాంతికి చోటు దక్కలేదు. పైగా అభ్యర్థిగా ఏ నియోజకవర్గం కూడా కేటాయించలేదు. మరీ బీజేపీలో ఉంటారా? లేదంటే గట్టు దూకేస్తారో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.




హైదరాబాద్: ప్రజల కోసమే తెలంగాణ ఎన్నికల్లో పాల్గొనకుండా ఉన్నామని వైతెపా అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఎవరో తమకు కిరీటాలు పెట్టాలని కోరుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై కేసు కొట్టేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిందన్నారు. అన్ని పార్టీల్లో దొంగలుంటారని.. కానీ ఆ దొంగలు సీఎంలు కాకూడదని ఆమె వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఉద్దేశించి షర్మిల పలు వ్యాఖ్యలు చేశారు. వైతెపాతో సంబంధం లేదని గతంలో సజ్జల అన్నారని.. ఇప్పుడు ఏ సంబంధం ఉందని తన గురించి ఆయన మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. తాము మాత్రం సంబంధం లేదనే అనుకుంటున్నామని వ్యాఖ్యానించారు. "మాతో సంబంధం గురించి సజ్జలే సమాధానం చెప్పాలి. ఏపీలో రోడ్లు, విద్యుత్‌పై తెలంగాణ సీఎం కేసీఆర్ బాహాటంగానే విమర్శించారు. ఆయన వ్యాఖ్యలపై సజ్జల ఏం సమాధానం చెబుతారు?సజ్జల గారూ.. ముందు మీ కథ మీరు చూసుకోండి" అని షర్మిల ఎద్దేవా చేశారు.

# గంగుల ల్యాండ్ కబ్జాలు చేస్తున్నారు



కరీంనగర్ : బీజేపీ ఎంపీ బండి సంజయ్ పోరాటం చూసి ఎమ్ఐఎమ్ ఆఫీస్‌కు మంత్రి గంగుల కమలాకర్ పరుగెత్తారని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. నేడు రాజాసింగ్ మీడియాతో మాట్లాడుతూ.. గంగుల ల్యాండ్ కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. తనతో పాటు బండి సంజయ్‌ను అసెంబ్లీకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. 'ఓవైసి నీకు దమ్ముందా..? ఉంటే కరీంనగర్‌లో పోటీకి పెట్టు' అని రాజాసింగ్ సవాల్ విసిరారు. కరీంనగర్ మైనార్టీలు ఆలోచన చేయాలన్నారు. మైనార్టీ అక్కా చెల్లెళ్ళ పరువు త్రిపుల్ తలాక్‌తో కాపాడామని రాజాసింగ్ వెల్లడించారు.

# చిన్న పార్టీలు వద్దు.. జాతీయ పార్టీలతోనే దేశం ఐక్యం: కోమటిరెడ్డి

నల్లగొండ: జాతీయ పార్టీలతోనే దేశం ఐక్యంగా ఉంటుందన్నారు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అలాగే, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని చెప్పుకొచ్చారు. అన్ని రాష్ట్రాల్లో చిన్న(ప్రాంతీయ) పార్టీలే అధికారంలోకి వస్తాయని సీఎం కేసీఆర్ అనడం సిగ్గుచేటు అంటూ ఘాటు విమర్శలు చేశారు. కాగా, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం నల్లగొండలో మీడియాతో మాట్లాడుతూ..'జాతీయ పార్టీ అని చెప్పుకుంటూ చిన్న పార్టీలే అధికారంలోకి వస్తాయని సీఎం కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడు. చిన్న పార్టీలు గెలిచి ప్రధాని మోదీకి సపోర్ట్ చేసి దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ సంపదను అంబానీ, ఆదానీలకు దోచిపెడుతోంది. ప్రధాని మోదీ అందరి అకౌంట్లో 15 లక్షలు వేస్తా, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు వేస్తా అన్నాడు. పది సంవత్సరాల నుంచి ఇంతవరకు ఎవరి అకౌంట్‌లోనూ పైసా వేయలేదు, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. ప్రగతి భవన్ ఖాళీ చేయాల్సి వస్తుందన్న ఆందోళనతో కేసీఆర్ నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నాడు. జాతీయ పార్టీ అని చెప్పి మహారాష్ట్రలో పనికిమాలిన నాయకులను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నాడు. వారిని ప్రగతి భవన్ తీసుకువచ్చి బిర్యానీలు పెట్టాడు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని పక్కదారి పట్టించడానికి కేసీఆర్ కొత్త నాటకం ఆడుతున్నాడు. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా రుణమాఫీ చేయడం లేదు. తెలంగాణ కోసం ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు' అంటూ కామెంట్స్ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com